JUNE 2003



# భక్తిమాల


1


2


3


4

# భక్తిమాల

## తెలుగు ఆధ్యాత్మిక మాసపత్రిక

పుష్పగుచ్ఛం ౨౬ జూన్ ౨౦౦౩ పుష్పం ౬



సంస్థాపకులు

**దత్తపీఠాధిపతి**

**శ్రీగణపతి సచ్చిదానంద స్వామీజీ**

ముక్తికన్యా వివాహేచ్ఛా
యద్యస్తి తవ మానసే।
ఆత్మాలంకరణార్థాయ
భక్తిమాలాం గలే ధర॥

**తాత్పర్యం**

ముక్తికన్య నిన్ను వరించాలంటే
భక్తిమాలతో నిన్ను అలంకరించుకో.

సంపాదకులు

**శ్రీ కుప్పా వేంకట కృష్ణమూర్తి**

యన్నామ కంఠే ధృత మాదరేణ
యద్రూప మాత్మన్యనుచింతితం వా
రక్షామణిస్స్యా త్సకలాపదార్తి
ప్రమోచక స్తం గురుదత్త మీడే ॥

(శ్రీ దత్త ధ్యానమాలిక)

ఆదరంగా ఆయన పేరు కంఠంలో ధరిస్తే చాలు (ఆయన నామకీర్తనం నిత్యం చేస్తే చాలు), లేదా ఆయన రూపాన్ని ఆదరంగా మనస్సులో నిత్యమూ స్మరిస్తే చాలు, ఆ నామమే, ఆ రూపమే, అన్ని ఆపదలనూ, దుఃఖాలనూ, పోగొట్టే రక్షామణిగా (తాయెత్తుగా) అయిపోతుంది. అట్టి ఆ గురుదత్త దేవుని స్తుతిస్తున్నాను.

# భక్తిమాల


## శ్రీభక్తిమాల ట్రస్టు (రి),

**శ్రీగణపతి సచ్చిదానంద ఆశ్రమము**

దత్తనగర్, మైసూరు - 570 025, ఫోను : 0821 - 2486486, 2480424,

ఫ్యాక్స్ : 0821 - 2487487.

వెబ్‌సైట్ http://dattapeetham.com.Email:mail@dattapeetham.com

**Bhaktimala Email :**
**subscription_bhaktimala@dattapeetham.com:** For Informaiton regarding Subcription, effecting change of your mailing address etc.


## ఈ సంచికలో .....


| | |
|---|---|
| శ్రీదత్త ధ్యానమాలిక | 1 |
| అమృత బిందువు | 3 |
| సూక్తిమంజరి (సాధువైరము) | 4 |
| పిల్లలూ, వీరు మీకు తెలుసా? | 6 |
| ఆత్మదానము | 11 |
| ట్రినిడాడ్ ఆశ్రమ సందర్శన | 14 |
| దత్తక్షేత్ర యాత్రా నివేదిక | 16 |
| శ్రీస్వామీజీవారి ఆంధ్రప్రదేశ్ యాత్రా విశేషములు | 24 |
| ఈ మాసంలో మన పర్వాలు | 32 |
| జ్ఞానబోధసభా సభ్యులకు ముఖ్య సూచనలు | 33 |
| శ్రీస్వామీజీ చరిత్ర | 36 |
| అనుభవాలు | 38 |
| శ్రీస్వామీజీవారి విదేశీ పర్యటనా పత్రిక | 45 |


## ఫోటోల వివరాలు

1) 18.5.03 న శ్రీస్వామీజీవారి 60 వ జన్మదినోత్సవాల మంగళాచరణ సభకు విచ్చేసిన ప్రముఖ వేదాంతి శ్రీ దయానంద సరస్వతి మహారాజ్ వారితో శ్రీస్వామీజీ.

2) ఆ ఉత్సవాల ముగింపు దినాన (25.5.03) పండిత సత్కార సభలో ఎడమ నుంచి కుడికి - కర్నాటక రాష్ట్ర గవర్నర్ శ్రీ చతుర్వేదిజీ, ఔదుంబర సింహాసనంలో శ్రీస్వామీజీ, నిలబడ్డ వ్యక్తి శ్రీబాలస్వామి, దత్తపీఠ వేదోపాధ్యాయుడు శ్రీ హరివీరభద్ర శర్మ ఘనపాఠి, శాస్త్రనిధి పురస్కార గ్రహీత ప్రొఫెసర్ యస్. వీరఘునాథన్, దత్తపీఠ ఆస్థాన విద్వాన్ బిరుదు గ్రహీత సహస్రావధాని శ్రీ పద్దిపర్తి పద్మాకర్.

*(10 వ పుట చూడండి)*


చందా వివరములు : – 2 సం॥లకు రూ. 150/– 5 సం॥లకు రూ. 350/–
దాతలు రూ. 2000/– పోషకులు రూ. 5000/–, రాజ పోషకులు రూ. 10,000.
విదేశీయులకు 1సం॥కు - 25 U.S. Dollars జీవిత సభ్యత్వం - 350 U.S. Dollars
ప్రకటన వివరములు : –, శ్రీస్వామీజీ ఫోటోతో పూర్తిపేజి రూ. 5000, స్వామీజీ ఫోటో
లేకుండా పూర్తిపేజి రూ. 4,500 సగం పేజి రూ. 2500, పావు పేజి రూ. 1300.
పెండ్లి & ఇతర ఆహ్వానాలకు రూ. 600.



**ఆధునికుడు** : అయ్యా! మంత్రాలకు చింతకాయలు రాలుతాయా?

**యోగి** : మంత్రమంటే యేమిటి?

**ఆధునికుడు** : శక్తి గలవాడి మాటే మంత్రమని మీరే చెప్పారు.

**యోగి** : మంత్రంవల్ల శక్తి కలుగుతుందా? శక్తివల్ల మంత్రం కలుగుతుందా?

**ఆధునికుడు** : మామూలుగా లోకంలో వుండే భక్తులు "మంత్ర జపాలు చేస్తే శక్తులు వస్తా"యని చెపుతూ వుంటారు. మీరు మాత్రం శక్తి గలవాడి మాటే మంత్రమన్నారు. శక్తి ఎలా వస్తుందో మీరు చెప్పలేదు.

**యోగి** : శక్తి అంటే ఏమిటో చెప్పానా?

**ఆధునికుడు** : చెప్పారు. కరుణ, పరిశుద్ధి - ఇవే శక్తులన్నారు.

**యోగి** : ఇవి ఎలా పెంపొందించుకోవాలో మీలాంటి విద్యావంతులకు నేను చెప్పాలా?

**ఆధునికుడు** : మేము కరుణ లేని వారమని గానీ, అపరిశుద్ధులమని గానీ నేననుకోవటం లేదు.

**యోగి** : నేనూ అనుకోవటం లేదు. మీ దగ్గర ఎంతో కొంత శక్తి వుంది. అందువల్లే మీరు కనీసం పసిపిల్లలనైనా ఆకర్షించ గలుగుతున్నారు. కానీ ఆ శక్తి ఇంకా పెరగాలంటే, మీరు అవధులు లేని భగవచ్ఛక్తిని ధ్యానించాలి. దానితో తాదాత్మ్యాన్ని భావించాలి.

**ఆధునికుడు** : దానికి ఉపాయమేమిటి?

**యోగి** : కొందరు పుణ్యాత్ములకు ఈ ప్రశ్న పుట్టదు. వారు తమ మనోబలంవల్లే దాన్ని సాధించుకో గలుగుతారు. వారిలో కరుణ ఉద్దీప్తమౌతుంది గనుక వారు తమకంటే తక్కువ స్థాయివారి ధ్యాన సౌకర్యంకోసం కొన్ని "శబ్ద తరంగాలను" తయారు చేశారు. వాటిలో కొన్ని అర్థంతో సూటిగా సంబంధంలేని ధ్వనులుగా వుంటాయి. అవే "బీజాక్షరాలు". మరి కొన్ని అర్థ సంబంధం గల వాక్యాలుగా వుంటాయి. అవే "మంత్రాలు."

**ఆధునికుడు** : ఈ మంత్రాలవల్ల ఇతర శక్తులు రావా?

**యోగి** : కరుణ, పరిశుద్ధి, వస్తాయి. వాటివల్ల ఏఏ పనులు జరగవలసిన అవసరం ఆయా సమయాలలో ఏర్పడుతుందో, అట్టి పనులన్నీ జరుగుతాయి. చింతకాయలు అలా రాలటం అవసరమైతే, అవి గూడా రాలుతాయి.




# సాధు వైరము

న ద్వేషభావేన రిపూన్ హినస్తి
మాంద్యాత్ స్వయం వా న భవేద్వినష్టః।
నయేన సౌమ్యేన సదా విధత్తే
హితం ద్వయో స్సజ్జన లక్షణం తత్॥

భావం : శత్రువులను ద్వేష భావంతో హింసించడు. అలసుడై, మందమతియై తనకు నాశనం తెచ్చుకోడు. సౌమ్యమైన ఉపాయంతో ఇద్దరికీ (తనకూ, శత్రువుకూ) హితం కలిగిస్తాడు. ఇది సజ్జనుడి లక్షణం.

సాధువు అనంగానే అసమర్థుడనీ, లోకజ్ఞానం లేనివాడనీ, చాలా మంది హృదయంలో గట్టిగా నాటుకు పోయి వుంటుంది. దీని అర్థం ఏమిటంటే - తెలివైనవాడు, చురుకైనవాడు, లోకజ్ఞుడైన వాడు, తప్పకుండా మోసకారి గానీ, క్రూరుడు గానీ, అయి తీరుతాడని వాళ్ళు నమ్ముతున్నారన్నమాట.

పై భావాలే గనుక నిజాలైతే రాముణ్ణి, వశిష్ఠుణ్ణి, నారద మహర్షిని, ఇలాంటి వారిని సాధువులనటానికి వీల్లేదు. కానీ వారు ఉత్తమ సాధు పురుషులని అనాది కాలంగా పెద్దలంతా విశ్వసిస్తున్నారు, ప్రబోధిస్తున్నారు.

అందుచేత సాధువులంటే ఎవరనే విషయాన్ని వివరించటం కోసం ఈ సూక్తి అందించ బడుతోంది.

సాధువులంటే సౌమ్యంగా వుంటారనీ, తిట్టినా నోరెత్తరనీ, వ్యవహారాల్లోకి వేలు దూర్చరనీ - ఇలా లక్షణాలు చెప్పామనుకోండి. అవి వారి సమగ్ర స్వరూపాన్ని మనకు అందించలేవు. సంకట పరిస్థితులు తలయెత్తినప్పుడు, సాధువులు ఎలా ప్రవర్తిస్తారో తెలిస్తే గానీ, వారి యొక్క అసలు స్వరూపం మనకు అర్థం కాదు.

సంకటాలలో శత్రు సంకటం మహాచెడ్డది. సమాజంలో వద్దన్న కొద్దీ అది మీద పడుతూనే వుంటుంది. నేను సాధువునని బోర్డు పెట్టుకొన్నా, అది ఆగదు.

శత్రుపీడ వచ్చి మీద పడ్డప్పుడు క్రూరులైతే ఉగ్రంగా ఆలోచిస్తారు. ఎదురుదాడి చేస్తారు. అసలు తామే ముందుగా శత్రువులై విజృంభిస్తూ వుంటారు.

అదే మధ్యములకు ఇలాంటి పీడ వస్తే, వాళ్ళు శత్రునాశనాన్ని మనస్సులో కోరుకొంటూ వుంటారు. లోలోపలే తిట్టుకుంటూ వుంటారు. తప్పని సరైతే ఎదురు తిరుగుతారు. లేదా పారిపోతారు. వీలు కుదిరితే రాజీ పడతారు.

మరి, సాధువులకు శత్రుపీడ వస్తేనో?!

వారు చపలులై అణిగి పడి వుంటారా?
తప్పించుకు పారి పోతారా?
అసమర్థులై వెఱ్ఱి చూపులు చూస్తారా?
సమర్థుల దగ్గరకు వెళ్ళి రక్షించమని కాళ్లు పట్టుకుంటారా?
తమ తపోబలంతో శత్రువులను భస్మీకరిస్తారా?

వీటిల్లో ఏ ఒక్కటీ సాధుమార్గం కాదు. సాధువు శత్రుత్వానికి మూలకారణాన్ని అన్వేషిస్తాడు. ఆ శత్రుత్వ బీజం తనలోకి ప్రవేశించకుండా కట్టుదిట్టం చేసుకొంటాడు. ఆపైన శత్రువుపట్ల సానుభూతితో, శత్రు దృక్కోణం నుంచి, సమస్యను పరిశీలిస్తాడు. ఆ దృక్కోణమే సరైనదనీ, తన దృక్కోణమే తప్పనీ తేలితే, తన తప్పు దిద్దుకోవటానికి ఆలస్యం చేయడు.

తన దృక్కోణమే సరైనదని ఖాయమైనపుడు, శత్రువును ఎదుర్కొంటూనే శత్రువుకు సద్బుద్ధి కలిగే ప్రయత్నం చేస్తాడు. అంటే, వీలైతే శత్రుత్వాన్ని నిర్మూలిస్తాడు. అది కుదరకపోతే, శత్రువునే నిర్మూలిస్తాడు. అలా శత్రువును నిర్మూలించేటప్పుడు కూడా, శత్రువుకి హితం జరగాలని కృషి చేస్తాడు. ఇదే ఉత్తమ సజ్జన లక్షణం. ఇదే సాధుపద్ధతి. దీనినే ఈ సూక్తి వివరిస్తోంది.

దీనికి మంచి ఉదాహరణ పిప్పలాద మహర్షి జీవితంలో వుంది. పిప్పలాదుడు దధీచి మహర్షి పుత్రుడు. ఆ దధీచిని దేవతలు తమ స్వార్థం కోసం చంపేశారు. కానీ ఆయన అనుమతి తీసుకొని మరీ చంపారు.

కొంతకాలానికి పిప్పలాదుడికి ఈ సంగతి తెలిసింది. దాంతో ఆయనకి దేవతలతో శత్రుత్వం వచ్చి పడింది. ఆయన శివుడ్ని గూర్చి తపస్సు చేసి, దేవతలను చంపగల శక్తిని ఇవ్వమని వరం కోరాడు. శివుడు ఒక రాక్షసిని సృష్టించేసి పిప్పలాదుడికి ఒప్పజెప్పాడు. ఈ వార్త తెలియంగానే దేవతలంతా శివుడి వెనకాల దాక్కొన్నారు. అపుడు పిప్పలాదుడు చిక్కులోపడి, తన కర్తవ్యమేమిటా అని శివుడితోనే చర్చించాడు. ఆ చర్చ ఫలితంగా, పిప్పలాదుడికి తన తల్లిదండ్రుల దర్శనం కలిగేటట్లుగా శివుడు అనుగ్రహించాడు. ఈ సందు చూసుకొని దేవతలందరూ పిప్పలాదుడి దగ్గరికే వెళ్ళి శరణు వేడారు. ఆ మహర్షి విశాల హృదయంతో దేవతలను మన్నించాడు.

ఈ విధంగా పిప్పలాదుడు తనకూ, దేవతలకూ కూడా క్షేమకరమైన రీతిలో శత్రువుల మీద విజయం సాధించ గలిగాడు. ఇదే ఉత్తమ సాధు రీతి.

శ్రీ దత్త సద్గురు కృపవల్ల మీకందరికీ జీవితంలో ఎదురయ్యే సమస్యలన్నిటి పట్లా సదవగాహన ఏర్పడి, సాధుజీవనం స్వయం సిద్ధమగుగాక!

జయగురుదత్త — శ్రీస్వామీజీ

పిల్లలూ, వీరు

# భగీరథుడు

మీకు తెలుసా?



'భగీరథ ప్రయత్నము' అనే మాట వినే వుంటారు. చాలా కాలంపాటు పట్టువదలకుండా చేసే ప్రయత్నాన్ని భగీరథ ప్రయత్నమనటం తెలుగులో సామెతగా మారిపోయింది. ఈ సామెతలోని భగీరథుడే ఇప్పుడు మన కథానాయకుడు.

గత సంచికలో మనం అంశుమంతుడి పుత్రుడే భగీరథుడని చెప్పుకున్నాం. కొన్ని పురాణాలలో అంశుమంతుడి పుత్రుడు దిలీపుడనీ, దిలీపుడి పుత్రుడు భగీరథుడనీ, వుంది. ఈ పురాణాల ప్రకారం దిలీపుడు కూడా తన తండ్రి లాగానే గంగావతరణం కోసం సుదీర్ఘకాలం తపస్సుచేసి, సిద్ధి అందకముందే శరీరం చాలించాడు.

పిన్న వయస్సులోనే రాజ్యాధికారానికి వచ్చిన భగీరథుడు, గత మూడు తరాలుగా తమ వంశంవారు చేస్తున్న కృషిని గురించి తీవ్రంగా ఆలోచించసాగాడు. ఆలోచించిన కొద్దీ తన ముత్తాతలకే గాక రాబోయే యుగయుగాల జీవులందరికీ, శాశ్వత స్వర్గ మార్గంగా దివ్యగంగను మానవలోకానికి అవతరింప చేయాలనే దీక్ష అతనిలో పెచ్చు పెరగ సాగింది.

ఒక పక్క రాజ్యవ్యవహారాలు చూసుకుంటూనే, తన తండ్రి, తన తాత, తన ముత్తాతలు చేసిన తపస్సేమిటి, పొందిన

ఫలమేమిటి, అసలైన ఫలం అందక పోవటానికి కారణమేమిటి? - అని లోతు లోతుగా, దీర్ఘ దీర్ఘంగా, ఆయన ఆలోచిస్తూ వుండేవాడు. లోలోపల ఏవేవో ప్రణాళికలు వేసుకుంటూ వుండేవాడు.

ఈ ఆలోచనలు ఇలా సాగుతుండగానే, ఆయనకు నాభాగుడు, శ్రుతుడు, అనే పుత్రులు కలిగారు. పెద్ద కొడుకుకి యుక్త వయస్సు వచ్చిందే తడవుగా అతన్ని సింహాసనం ఎక్కించేసి, 'జై గంగామాతా' అంటూ తపోవనాలకు తరలిపోయాడు భగీరథుడు.

అంత హడావిడిగా వెళ్ళిన ఆ పెద్ద మనిషి గంగను గూర్చి తపస్సు చేయలేదు. బ్రహ్మదేవుణ్ణి గూర్చి తపస్సు చేశాడు. వేల వేల ఏళ్ళు తపస్సు చేయగా, బ్రహ్మ ప్రత్యక్షమై, ఏమి కావాలన్నాడు. భగీరథుడు అంజలి ఘటించి, ఇలా విన్నవించాడు-

"బ్రహ్మదేవా! నా ముత్తాతలకు ముక్తి కలిగించే సంకల్పంతో, మూడు తరాలుగా ముగింపు లేని తపస్సు జరుగుతోంది. అదే ధర్మసాధన కోసమై నేనూ తపస్సులోకి దిగాలనుకొంటున్నాను. కానీ నాది ముగింపు లేని తపస్సు కావటానికి వీలు లేదు. దేవదేవా! నాకు అర్హత కలిగి, గంగాభవాని కరుణించి, పాతాళలోకంలో ప్రవహించే దాకా, నా తపస్సు ఆగరాదు. నా ఆయువు అడుగంటరాదు. ఈ వరం అనుగ్రహించు. నీ విచ్చే ఆయుష్యాన్ని ఈ తపస్సుకే వినియోగిస్తాను. వేరే పనులు చేయను."

బ్రహ్మదేవుడు సుప్రసన్నుడై, నిశ్చింతగా తపస్సు కొనసాగించుకోమని వరమిచ్చి, వెళ్ళిపోయాడు.

అప్పుడు భగీరథుడు గంగాదేవి కోసం తపస్సు మొదలు పెట్టాడు. పది వేల సంవత్సరాలకు గంగమ్మతల్లి దివ్య స్వరూపంతో

ప్రత్యక్షమై, "ఏమి కావాలో కోరుకో"మంది. భగీరథుడు పొంగిపోయి, "తల్లీ! నువ్వు భూలోకానికి రా! అక్కడి నుంచి పాతాళ లోకానికి గూడా రా! ఇదే నేను కోరే వరం" అని చేతులు జోడించాడు.

గంగాదేవి అవునన లేదు, కాదన లేదు, ఆలోచనలో పడిపోయింది.

ఆమె దేవత. దేవతలంటే సూక్ష్మ తేజోమయ మూర్తులు. దేవతాలోకాలలో వుండే పంచభూతాలు గూడా సూక్ష్మ పంచభూత స్వరూపంగానే వుంటాయి. భూలోకంలో పంచభూతాలు స్థూల స్వరూపంగా వుంటాయి. భూలోక జీవులు సూక్ష్మ పంచభూత స్వరూపాలను ఎదురుగా వున్నా సరే గుర్తించలేరు. ప్రస్తుతం సూక్ష్మ జలరూపిణిగా వున్న గంగాదేవి స్వరూపాన్ని స్థూల జలరూపంగా మార్చాలంటే, ఆ శక్తి శివుడికే వుంది. కనుక ఈ భగీరథుడు శివానుగ్రహం సంపాదిస్తే గానీ, అతను అనుకొన్న పని పూర్తి కాదు.

గంగాదేవి ఈ విషయాలన్నీ ఆలోచించి, పైకి మాత్రం గర్వంగా చూస్తూ – "భగీరథా! నేను వస్తానయ్యా! కాని నేను స్వర్గంనుంచి భూమి మీదికి దూకితే, నా వేగానికి భూమండలమే కొట్టుకు పోతుంది. నా వేగాన్ని తట్టుకొని, నన్ను మెల్లిగా భూమి మీదికి దింపగల సమర్థుడు కావాలి. నాకు తెలిసినంతలో ముల్లోకాలలో ఎవరికీ ఆ శక్తి లేదు. ఒక వేళ వుంటే కైలాసవాసియైన ఆ శివుడికి వుండాలి. అడిగి చూడు. ఆయన ధైర్యం చేస్తానంటే, నేను ఆయన నెత్తిమీదికి దూకేస్తా."

ఇలా అనేసి మరో మాటకు సావకాశం లేకుండా మాయమై పోయింది గంగాదేవి.

భగీరథుడు ఒక్క క్షణం దిగాలు పడిపోయి, మరుక్షణంలోనే తేరుకుని, ద్విగుణీకృతోత్సాహంతో శివుడి గురించి తపస్సు ప్రారంభించాడు. మళ్ళీ మరో పదివేల ఏళ్ళకు శివుడు ప్రత్యక్షమై, ఏమి కావాలో కోరుకోమన్నాడు. భగీరథుడు చాలా జాగ్రత్తగా మాటలు పేర్చుకోసాగాడు –

"మహాదేవా! పరమేశ్వరా! నా ముత్తాతలు పాతాళ లోకంలో భస్మరాశులుగా పడివున్నారు. వారి ముక్తి కోసమై గంగాదేవిని అక్కడికి రమ్మని ప్రార్థించాను. నువ్వు దయతో సహాయం చేస్తే, ఆమె క్రిందికి దిగి వస్తానన్నది. దయచేసి నా తపస్సు ఫలించేటట్లు అనుగ్రహించు."

శివుడు మాత్రం భగీరథుడు అనుకున్నంత ప్రసన్నంగా లేడు. ఆయన ఉగ్ర తాండవం చేస్తూ, మధ్యలో ఒక సారి ఆగి –

"ఏమిటి? ఆ గంగ నా నెత్తి మీదికి దూకుతుందా? తట్టుకునే సమర్థుడు కావాలా? సరే రమ్మను. ఏ మాత్రం శక్తి చూపిస్తుందో చూపించమను." అనేసి మళ్ళీ ఉగ్రతాండవంలో మునిగిపోయాడు.

భగీరథుడికి ప్రాణసంకటంగా వుంది. ఈ దేవతలూ దేవతలూ పంతాలు పెట్టుకుని, తన కొంప ముంచుతారేమోనని భయంగా వుంది. అయినా శివుడు కాదనలేదు కనుక, ధైర్యం తెచ్చుకుని, గంగాదేవిని ధ్యానించి, ఆహ్వానించాడు.

చూస్తుండగానే ఆకాశంలో పిడుగుపాట్లను మించిన హోరు ధ్వనులతో, గంగాదేవి స్వర్గం నుంచి ప్రచండ వేగంతో దూకడం కనిపించసాగింది.

ఈ వేగమేమిటి? ఈ ఆర్భాటమేమిటి? అని బెంబేలెత్తిపోతూ భగీరథుడు ఇటు శివుడి వంక చూసేసరికి, ఆయన నాట్యంలో పేట్రేగిపోతూ, గిర్రున తిరుగుతున్నాడు. ఆ వేగానికి ఆయన నెత్తి మీద ముడిపెట్టి వున్న జడలు విడిపోయి, ఆకాశంలో కొన్ని వందల యోజనాల దూరానికి వ్యాపించి, శివుడి శిరస్సు చుట్టూ జడలతో ఒక పెద్ద తొట్టె కట్టినట్లైంది. క్రింద వున్న భగీరథుడికి పైన ఏమి జరుగుతోందో అర్థం కాలేదు.

(సశేషం)

**ఫోటోల వివరాలు**

(2 వ పేజీ తరువాయి)

3) 4వ దత్తవేంకటేశ్వర బ్రహ్మోత్సవాలలో పూర్ణాహుతి సన్నివేశం.

4) శ్రీస్వామీజీనుంచి దీక్షా స్వీకారం చేసిన అనంతరం శ్రీస్వామీజీ ఆశీస్సులందుకొంటున్న మాతా శివచైతన్య (గుంటూరు) (దీక్షా నామము శ్రీమాతా చైతన్యానందిని).

5) నృసింహ జయంతి ఉత్సవ సందర్భంగా నృసింహార్చనలో శ్రీస్వామీజీ.

6) 1963 లో మైసూరు మేటగళ్ళి పోస్టాఫీసులో శ్రీస్వామీజీ పనిచేసిన నాటి ముద్రించే స్టాంపును పోస్టల్ అధికారులు శ్రీస్వామీజీకి సమర్పిస్తున్న దృశ్యం.

7) ఒకప్పుడు శ్రీస్వామీజీ వివాహం జరిపించిన దంపతులకు జన్మించిన స్త్రీ సంతానంతో (మనవరాళ్ళతో) శ్రీస్వామీజీ.

8) మే 15, 16 తేదీలలో నాదమండపంలో జరిగిన అఖిలభారత మరాఠా సాంస్కృతిక సమ్మేళన ఉత్సవాలలో జ్యోతి ప్రజ్వలన సన్నివేశం.

☆ ☆ ☆

గమనిక : అనివార్యకారణాలవల్ల "వేదాంతపాఠములు" ధారావాహికను ఈ నెల అందించలేకపోతున్నందుకు చింతిస్తున్నాము. – సం॥.

# ఆత్మదానము



శ్రీగణపతి సచ్చిదానంద స్వామీజి

*(జరిగిన కథ : ప్రత్యక్షమైన లీలాబాలుడు మాయమవటం కూడా తెలీని అత్రిముని దంపతులకు ముని కులాల స్తోత్ర పాఠంతో స్పృహ వచ్చినట్లైంది. ముని సంఘాలలోని ఒక వృద్ధతాపసుడు అత్రిమునీంద్రుడ్ని అభినందిస్తూ, అనసూయామాత గొప్పతనాన్ని కొనియాడాడు. అంతేగాక తమందర్నీ శిష్యులుగా స్వీకరించమని ప్రార్థించాడు. ఈ సంఘటనకు అత్రిమునీంద్రుడు ఇబ్బంది పడిపోయి, "అయ్యలారా! సూర్యోదయ సమయమౌతోంది. ఇక సంధ్యావిధులు నెరవేరుద్దాం రండి" అంటూ నిర్వింధ్యానదివైపు నడిచాడు. అక్కడ స్నాన సంకల్ప సమయంలో గానీ, ఈనాడు మార్గశీర్ష పౌర్ణమని ముని జనులకు గుర్తు రాలేదు. ఇక చదవండి .......)*

అత్రిమునీంద్రుడి తిరుగు ప్రయాణం, వెనుకటి ప్రయాణం లాగా లేదు. ఆ విలక్షణత అనేక విధాలుగా వుంది. వృద్ధ జనులు సేదదీర్చుకోవటం కోసం అత్రి మునీంద్రుడు కొన్ని నెలలు ఋక్షాద్రిమీదే నిలిచిపోయాడు. ఆగి ఆగి, భాద్రపద పూర్ణిమనాడు తన ఆశ్రమదిశగా ప్రయాణం మొదలు పెట్టాడు. కానీ, ఆయన ప్రయాణం వేగాన్ని పుంజుకోక, పెళ్లి నడకలు వొలకబోస్తూనే వుంది.

ఇంతకు ముందేమో వారిద్దరే. ఇప్పుడు శిష్యసంతతి వేలకు వేలుగా వెంట వుంది. ఇంతకు ముందేమో లక్ష్యసాధనావేగం కాళ్ల కింద తాటాకుల మంటలు పెట్టినట్లుగా వుంది. ఇప్పుడేమో మనసులో శాంతి స్థిరంగా ఆవరించి వుంది. అప్పుడేమో దీక్షా ముహూర్తం దాటిపోతుందేమో అనే భయం తొందర పెట్టేది. ఇప్పుడేమో తోటి వృద్ధులందరికీ శ్రమ కలుగుతోందేమోనన్న భయం కాళ్లను కట్టిపడేస్తోంది. అన్నిటినీ మించి, అప్పుడేమో తామిద్దరూ అనామకులు. ఎవరి కంటా పడకుండా చకచకా తమ ప్రయాణం సాగింది. ఇప్పుడు తమ పేరేమో నలుదిక్కులా మారుమ్రోగుతోంది. ఆ పైన, స్తుతులు చేసే పెద్ద పరివారం ఒకటి వెనకాలే వుంది. ఇక కావలసిందేమిటి? అడుగడుగునా గ్రామాల్లోని పెద్దలు

అర్ఘ్యపాద్యాదులతో ఎదురు వస్తున్నారు. గ్రామాల్లోకి రమ్మని బలవంత పెడుతున్నారు. అత్రిమునీంద్రుడు వారి కెలాగో సమాధానం చెప్పి, పంపేస్తున్నారు. కొన్ని చోట్ల గ్రామం గ్రామమంతా మునీంద్రుడి సన్నిధికి వచ్చి, వరుసగా మనిషి మనిషీ ప్రత్యేక ఆశీస్సులను పొంది గానీ కదలటం లేదు. అత్రిమునీంద్రుడేమో ఎవ్వరి మనస్సూ నొప్పించడు.

ఇదిలా వుండగా, తోడుగా వచ్చే పరివారంలో ఒక్కొక్కరికీ ప్రత్యేక నియమాలు కొన్ని వున్నాయి. ఆ నియమాలకు అనుకూలంగా మధ్య మధ్యలో కొద్దిసేపు ప్రయాణాన్ని ఆపు చేయవలసి వస్తోంది.

ఇలా అడుగడుగునా హంసపాదంగా, ఇప్పటికి పదిహేను రోజుల ప్రయాణం సాగింది. నేడు భాద్రపద అమావాస్య. ఇక రేపటినుంచి, శరన్నవరాత్రులు మొదలౌతాయి. అత్రిమునీంద్రుడి శిష్యులలోని శ్రీవిద్యోపాసకులకు ఆ పదిరోజులూ అత్యంత ప్రముఖాలవటం చేత, ఒక చోట నిలవక తప్పటం లేదు. ఇవాళ్టి మజిలీ అయిన గ్రామం వారు, ఇవాళ్టి నుంచే తమ గ్రామంలో వుండి పొమ్మని బలవంత పెట్టినా గానీ, గ్రామమైనా కాకున్నా సరే. రేపటి ఉదయం వేళకు చేరుకొన్న చోట నిలవవలసిందే కానీ, ముందుగా ప్రయాణం ఆపటానికి వీల్లేదని చెప్పి, అత్రిమునీంద్రుడు వాళ్లను పంపేశాడు. పై గ్రామం కొద్ది దూరంలోనే వుండటం చేత ఈ పదిరోజులూ అత్రిమునీంద్రుడి సాన్నిధ్య భాగ్యం ఆ గ్రామానికే దక్కుతుందని ఈ గ్రామంవారు తమలో తాము గుసగుసలాడుతూ, చివరికి తాము కూడా అత్రిమునీంద్రుడ్ని వెంబడిస్తూ నడక సాగించారు.

మరు నాడు సూర్యోదయమయ్యే సరికి, అత్రిమునీంద్రుడు పరివార సమేతంగా పై గ్రామపు దాపుల్ని చేరారు. అప్పటికి ఆ గ్రామ పెద్దలు పూర్ణకుంభంతో, దివిటీలతో, మంగళవాద్యాలతో, అత్రిమునీంద్రుడికి స్వాగతోత్సవం చెయ్యాలని ఊరి పొలిమేరలలో సిద్ధంగా వున్నారు.

అనసూయాత్రిమునీంద్రులు దూరంనుంచే ఈ జనసమూహాన్ని పరిశీలించి చూశారు. ఆ జనసమూహానికి శిరోభాగాన మెరుపు తునకల లాంటి మూడు రూపాలు వారి చూపులను ప్రత్యేకంగా ఆకర్షించాయి.

అత్రిమునీంద్రుడు, వారి పరివారము, కనబడగానే ఆ గ్రామ జనులంతా ఉత్సాహోద్రేకంతో ఎదురుగా నడచి రాసాగారు.

అత్రిమునీంద్రుడికి మాత్రం ఆ మూడు రూపాలే ప్రధానంగా కనిపిస్తున్నాయి. మధ్య వున్న దూరం తగ్గిపోయిన కొద్దీ. ఆ ముగ్గురూ వర్చోనిధులైన బ్రాహ్మణులని, వాళ్లు మధ్య వయస్కులని, తేటపడసాగింది. పోలికల తీరు చూస్తే వారు

అన్నదమ్ముల లాగా వున్నారు. వాళ్ళ దగ్గరయ్యే సరికి, వాళ్ళ ఫలానావాళ్లని గుర్తించారు కాబోలు. అత్రిఅనసూయులు ఒకరి ముఖం ఒకరు చూసుకొని చిరునవ్వులు నవ్వుకొన్నారు.

మంగళ తూర్యనాదాలు, స్వస్తిమంత్ర ఘోషలు, ఆకాశాన్ని అంటేటట్లుగా స్వాగత విధులను నిర్వర్తిస్తూ, ఆ గ్రామ ప్రజలు మునీంద్రుడ్నీ, ఆయన పరివారాన్నీ, తమ గ్రామసీమలోకి తీసుకుపోయారు. ఎప్పుడింత పని చేశారో?! పొలాల నిండా పందిళ్ళూ, పాకలూ, వేసి అందరికీ తగిన వసతులు ఏర్పాటు చేశారు.

ఆ ముగ్గురు అన్నదమ్ములూ ఆ వూరి ప్రజలకు నాయకుల లాగా వున్నారు. వాళ్ల మాటలే ఆజ్ఞలుగా తీసుకొని అక్కడ సన్నాహాలు జరిగిపోతున్నాయి. వాళ్ల ముఖాలలోని వర్చస్సు, వాళ్ళ మాటలలోని వినయం, వాళ్ళ కళ్ళల్లోని తెలివి, వాళ్ళ శరీరాలలోని చురుకు, ఆశ్చర్యం కలిగిస్తున్నాయి. కానీ, ఆ ఊరివారికి మాత్రం అవి కొత్త కాదు. కానీ అత్రిమునీంద్రుడితో, అనసూయామాతతో, ఆ ముగ్గురికీ గల చనువు చూసి, ఆ మునిదంపతులు వీళ్ల మీద చూపిస్తున్న వాత్సల్యాన్ని చూసి, ఆ గ్రామప్రజలే కాక, అత్రిమునీంద్రుడి పరివారానికి గూడా ఆశ్చర్యమౌతోంది. వాళ్ళు ముగ్గురూ మునిదంపతుల్ని "తాతగారూ! తాతమ్మా!" అని పిలుస్తున్నారు. వాళ్లేమో వీళ్లని "మా తండ్రీ! మా నాయనా!" అని పిలుస్తున్నారు.

ఆ గ్రామపు పెద్దలకి మనస్సులలో ఇప్పటి దాకా ఒక సందేహరేఖ కలుక్కుమంటోంది. "ఇప్పుడు శాకలశర్మగారు గ్రామంలో వుండటం లేదు కదా! వారి పుత్రులు, ఈ ముగ్గురూ, ఎంతైనా చిన్నవాళ్లు కనుక, అత్రిమునీంద్రుడ్ని ఈ పది రోజులూ మన గ్రామాన నిలిచేటట్లుగా అంగీకరింప చేయగలుగుతారా?" అని.

అవును! మరి శాకలశర్మ అంటే, అతడు మహాయోగి, మహాజ్ఞాని. ఆయన కొకరు సాటేమిటి? ఆయనను చూసి పోవటానికి ఇంతకుముందు అత్రిమునీంద్రుడే స్వయంగా వారింటికి వచ్చారు. ఇప్పుడు ఆయన తురీయాశ్రమ స్వీకారం చేసి గ్రామం విడిచి వెళ్లాడు. ఈ ముగ్గురూ ఆయన పుత్రులు. వీళ్లూ విశిష్టులే, విద్వాంసులే గానీ, తండ్రిగారి అంతస్తు వీరికెక్కడ? అత్రిమునీంద్రుడు వీళ్లనసలు గుర్తే పట్టకపోవచ్చు. గుర్తించినా, పలకరించి, ఆశీర్వదించి, ముందుకు సాగిపోవచ్చు. ఎవరు చెప్పగలరు?

(సశేషం)

# ట్రినిడాడ్ ఆశ్రమ సందర్శన

నివేదిక : శ్రీ హెచ్.వి.ప్రసాద్ అనువాదం : డా॥ హరగోపాల్

ట్రినిడాడ్ ఆశ్రమమున బృహదాంజనేయ విగ్రహము (85 అడుగులు) నిర్మితమవుతున్న సంగతి దత్త భక్తులందరికీ విదితమే. అయితే యీ బృహత్కార్యం చేపట్టినప్పటినుంచి, అనగా సుమారు 18 నెలల నుంచి ట్రినిడాడ్ భక్తులు చేస్తున్న ప్రార్థనలు ఫలించి, శ్రీస్వామీజీవారి 64వ విదేశయాత్రగా రూపొందినది. ఈ కార్యక్రమాభివృద్ధి ఇంతవరకు, ఎలా సాగినదో చూసి, తగు సూచనలివ్వవలసినదిగా ప్రార్థిస్తూ, ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ట్రినిడాడ్ భక్తుల హృదయాలను పరవశింపచేసింది. ది 6.3.2003 సాయంకాలం 4.30 గంటలకు పోర్ట్‌ఆఫ్‌స్పెయిన్‌కి చేరుకున్న శ్రీ స్వామీజీకి, దత్తాత్రేయ యోగ సెంటరు అధ్యక్షులు శ్రీ రమేష్‌మహారాజ్, శ్రీమతి తారామహారాజ్, సెనేటరు శ్రీ సతీష్ రాంరూప్, ప్రాజెక్టు కమిటీ అధ్యక్షులు శ్రీ విష్ణుదియోనారాయన్, దత్తయోగసెంటరు కార్యదర్శి శ్రీ పెర్సిన్ సీనాథ్, దత్తయోగ సెంటరు పూర్వాధ్యక్షులు డా॥ రాల్ఫ్ సీయుప్రసాద్ మున్నగు భక్తులు పూర్ణకుంభ సమేత పుష్పాంజలులతో స్వాగతం పలికారు. విమానాశ్రయంనుంచి ఆశ్రమానికి ప్రయాణిస్తుండగా, ఆ దేశపు రేడియో ఎఫ్.ఎమ్ 103 "అవధూత దత్తపీఠాధిపతి మైసూరు, ట్రినిడాడ్ విచ్చేశారు. ఇప్పుడు కరపి చైమాలోని ఆశ్రమానికి వెళ్తున్నారు. ట్రినిడాడ్ ప్రజలతరఫున శ్రీవారికి స్వాగతాంజలులు పలుకుచున్నాం" అని స్వాగత ప్రసారము చేసి, శ్రీస్వామీజీ గానం చేసిన విశ్వశాంతిగీతం "జయజయ భువి దివి మానవా" ను ప్రసారం చేసింది. ఇది విన్న మా హృదయాలు పులకించాయి. ఇంతకంటే హృదయపూర్వకంగా ఎవరు స్వాగతం చెప్పగలరు?

ఆశ్రమం సమీపిస్తుండగా శ్రీస్వామీజీ నన్ను హనుమవిగ్రహము సమున్నతముగా వున్నదో, లేదో, గమనించమని ఆదేశించారు. దైవీశక్తి ప్రసరింపజేసే మూర్తులను శిల్పి సాంగోపాంగముగాను, సమతుల్యముగాను చెక్కాలి. ఇందు ఏ మాత్రము పొరపాటు జరగటానికి వీలులేదు. అతిజాగ్రత్తగా శిల్పి విగ్రహాన్ని మలచాలి. ఎంతో ఉత్కంఠతతో కారు కిటికీలోంచి గమనించినాం. బృహదాకారంతోను, శరీర భాగాలన్నీ సమతుల్యంతోనూ, ఎవరికీ లేని తనదైన ప్రత్యేక రాజఠీవితోనూ, హనుమ దర్శనమైంది. ఆనందాశ్చర్యాలతో నోరు మూగబోయింది. బహుశా నా మౌనమే సమాధానం చెప్పినట్లుంది. కారు కిటికీలోంచి

చూసిన శ్రీస్వామీజీ ముఖాన విరిసిన ఆనందపారవశ్యం, హనుమ ఎలా వున్నాడో చెప్పినాయి. ఆశ్రమద్వారం వద్ద కారుదిగిన శ్రీస్వామీజీ తదేక దీక్షతో హనుమ విగ్రహాన్ని గమనించారు. ఆ సమయములోనే భక్తులు గానం చేస్తున్న దివ్యనామ సంకీర్తన మమ్మల్నాందరినీ పారవశ్యులను చేసింది.

పునర్నిర్మాణమవుతూ, కొత్త సింగారాలు రూపుదిద్దుకుంటున్న ప్రార్థనా మందిరములోకి అడుగిడి చేసిన బహుదూరపు ప్రయాణ బడలిక, ఏ మాత్రము కనబడనీయక, ఓపికగా భక్తులు సమర్పించిన పుష్పాంజలులను స్వీకరించారు. దత్తయోగాసెంటరు అధ్యక్షులు స్వాగతవచనాలు పలుకుతూ, తమకోసమై విచ్చేసిన శ్రీస్వామీజీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శ్రీస్వామీజీ తమ సంగ్రహ అనుగ్రహ భాషణమున ట్రినిడాడ్ భక్తులు సాధిస్తున్న యీ అద్భుతకార్యం, శ్రీస్వామీజీ చేసిన మిరకిల్స్ అన్నింటినీ మరపిస్తున్నదని అభినందించి, ఆశీర్వదించారు.

మరుసటి రెండు రోజులు కూడా ట్రస్టీలతో సమావేశమై, జూన్‌లో జరుగబోవు ప్రతిష్ఠా కార్యక్రమాలను కూలంకషంగా చర్చించి, తగు సూచనలను చేశారు.

8వ తారీఖున ప్రధానమంత్రి శ్రీ పాట్రిక్ మానింగ్ శ్రీస్వామీజీని దర్శించి హనుమ ప్రాజెక్టు గురించి చర్చించి, అభినందించి, ఆశీర్వచనములు గైకొన్నారు.

9వ తారీఖున ట్రినిడాడ్ సెనేటు అధ్యక్షులు, దేశతాత్కాలిక అధ్యక్షులు డా॥ లిండా బాబూలాల్‌గారు శ్రీస్వామీజీని దర్శించి, శ్రీచక్రపూజను చూచి, ఆశీర్వచనములను గైకొన్నారు. సాయంకాలం నాదసంగమ స్టీల్‌బాండువారు స్వామీజీ భజనలను వినిపించారు. శ్రీస్వామీజీ కూడ ఒక భజన పాడించారు. తదుపరి స్థానిక మంత్రులు శ్రీస్వామీజీ దర్శనము చేసుకొన్నారు. పిమ్మట ఇండియా నుంచి ఇచ్చటకు ప్రతిష్ఠకై చేరిన దేవతామూర్తులను పరీక్షించారు.

శ్రీస్వామీజీతో వచ్చిన శ్రీస్వామి మానసదత్త (రాధాకృష్ణ) ట్రినిడాడ్‌లో రాబోయే ప్రతిష్ఠా కార్యక్రమములు, నిర్మాణ కార్యక్రమములను పర్యవేక్షించుటకు వుండిపోయారు. 10 వ తేది సాయంకాలం ట్రినిడాడ్ నుంచి బయలుదేరి 11 వ తేది ఉదయం లండన్‌కు చేరుకున్నారు. శ్రీస్వామీజీ సాయంకాలం యూరోదత్తసెంటరునందు శ్రీచక్రపూజ,అనుగ్రహభాషణము చేసి, 12 వ తేదీన లండనునుంచి బయలుదేరి, 13 వ తేదీ ప్రాతఃకాలమున ఢిల్లీ చేరారు.

దత్తయోగాసెంటరు, ట్రినిడాడ్‌వారు త్వరలో ఒక వెబ్‌సైటు (www.dyc-tt.org) ప్రారంభించనున్నారు. దత్తభక్తులు మరిన్ని వివరములను పై వెబ్‌సైటు ద్వారా గాని www.dattapeetham.com నుంచి గాని తెలుసుకొనవచ్చు.

జయగురుదత్త

# దత్తక్షేత్ర యాత్రా నివేదిక

(గత సంచిక తరువాయి)

రాజమండ్రి : శ్రీదత్తపాదుకా క్షేత్రము

పిఠాపురం నుండి బయలుదేరిన శ్రీస్వామీజీవారు మార్గమధ్యమున అనేక భక్త జన గృహములను, ప్రఖ్యాత వేదవిద్వాంసులు శ్రీ గుళ్ళపల్లి సీతారామచంద్ర ఘనపాఠిగారు నిర్వహిస్తున్న శ్రీ దత్తాత్రేయ వేదవిద్యా గురుకులమును సందర్శించి, ఆశీర్వదించి, సాయంకాలం సుమారు 4 గంటలకు ఆశ్రమానికి చేరిన శ్రీస్వామీజీకి, స్థానిక ట్రస్టీలు, భక్తులు, స్కూలు విద్యార్థులు, వేదపండితులు స్వాగతాంజలులు ఘటించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషను స్థానికశాఖ, వైద్యసభ్య బృందం, శ్రీస్వామీజీవారిని సందర్శించుకొన్నారు. శ్రీస్వామీజీ స్థానిక ఆశ్రమ ప్రాంగణమును వినియోగించుకొని ఉచితవైద్య సేవ లందించవలసినదిగా సూచించారు. ఆ సూచనకు స్పందిస్తూ, డా॥ గనీ భాస్కరరావు, ఛైర్మన్, జి.ఎస్.ఎల్. అకాడెమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్, తమ సంస్థనుంచి ప్రతిరోజు ఒక స్పెషలిస్ట్ డాక్టరుతో ఆశ్రమ ప్రాంగణమున ఉచిత వైద్యశిబిరమును నిర్వహిస్తామని తెలిపారు. మిగిలిన వైద్యులు కూడ తమవంతు సేవ చేయుటకు సంసిద్ధతను వ్యక్తము చేశారు.

తరువాత జరిగిన ట్రస్టీల మీటింగునందు క్షేత్రవృద్ధికై తగు సూచనలిచ్చారు. అందు ముఖ్యముగా గోదావరీ తీరమున ప్రభుత్వము వారు ఇచ్చుస్థలమునందు దత్తదేవాలయ నిర్మాణమునకును; రాబోయే గోదావరీ పుష్కర సందర్భముగా అన్నదాన కార్యక్రమము, అత్యవసర వైద్యసేవా సదుపాయములు,యాత్రికులందరును శ్రాద్ధ కర్మలు చేసుకొనుటకు అవసరమైన సదుపాయములు కలుగచేయుటకు; ఆశ్రమమున మరకత గురుపాదుకలు ప్రతిష్ఠించుటకును, ఆశ్రమ ప్రాంగణమున క్షేత్రమునకు వచ్చు భక్తులకు వసతి సదుపాయములు చేయుటకునూ తీర్మానించారు.

సాయంకాలం శ్రీచక్రపూజానంతరము జరిగిన స్వాగతసభ, దత్తపీఠ ఆస్థాన విద్వాంసులు, ప్రముఖ సాహితీవేత్త డా॥ బేతవోలు రామబ్రహ్మంగారి స్వాగత వచనములతోనూ, గురుతత్త్వ విచారణా వివరణతోనూ, జయప్రదంగా నిర్వహించబడింది. 'నిత్యపూజా' స్కీము కూడా శ్రీస్వామీజీవారిచే ప్రారంభించబడింది.

ది. 22.1.03 ఉదయం ఆశ్రమ పరిసర ప్రశాంత వాతావరణమున శ్రీస్వామీజీ ఉదయ వాహ్యాళి చేసి ఆనందించారు. పిమ్మట శ్రీచక్రపూజ, మహారుద్ర హోమము నిర్వహించబడినాయి. మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక జి.ఎస్.ఎల్. అకాడమీ

ఆఫ్ మెడికల్ సైన్సెస్ వారిచే నిర్వహించబడుచున్న, 750 పడకల సూపర్‌స్పెషాలిటీ హాస్పిటలును సందర్శించి ధవళేశ్వరమునకు బయలుదేరి వెళ్ళారు. యిచ్చట పవిత్ర గోదావరీ తీరమున ఒక 1000చ.గ.ల స్థలమును స్థానిక ప్రముఖ ఆయుర్వేద వైద్యులు డా॥. గంటి కళ్యాణశర్మగారు దత్తపీఠమునకు సమర్పించారు. శ్రీస్వామీజీ ఈ స్థలమును పరిశీలించి తమ అంగీకారమును తెలిపారు. రాబోయే గోదావరి పుష్కర సమయమునకు భక్తుల సౌకర్యమునకై యిచ్చట ఒక స్నానఘట్టమును నిర్మించవలసినదిగా ఆదేశించారు. దీన్ని కూడ విజయవాడ సమీపమున కృష్ణానదీతీరమున నున్న జయదుర్గాతీర్థమువలెనే పెంపొందించ వలసినదిగా ఆనతిచ్చారు.

సాయంకాలము స్థానిక తిరుమల తిరుపతి దేవస్థాన కళ్యాణమంటపమున శ్రీస్వామీజీచే దివ్యనామ సంకీర్తన నిర్వహించబడింది. అందు డా॥. రామబ్రహ్మంగారు స్వామీజీ వారి దివ్యకీర్తనలను గురించి వివరిస్తూ, శ్రీస్వామీజీ షష్ట్యబ్ది సందర్భముగా రచించిన 'విశ్వశాంతి గీతము' ను గురించి విశేషముగా వివరిస్తూ, దానిని 'విశ్వశాంతి గీతము' గా అభివర్ణించారు.

మరునాడు ది. 23.1.03 న అన్నవరమున, రత్నగిరిపంక్తులలో వెలసి, కొలువుతీరియున్న శ్రీ వీరవెంకట సత్యనారాయణస్వామికి పూజ లర్పించారు. ఆలయ ఇ.ఓ., ట్రస్టీలు, వేదపండితులు శ్రీస్వామీజీకి పూర్ణకుంభ వేదోక్త స్వాగతములు పలికారు. పిమ్మట జరిగిన పత్రికా గోష్ఠిలో, శ్రీస్వామి వారిని భక్తుల కష్టములను కడతేర్చుమనియు, స్థానిక పురోహితులు, ఆలయ సిబ్బంది సంక్షేమము కొరకు ప్రార్థించితిమనియు, ఈ ఆలయచరిత్రను, మహిమను యింకా విస్తారముగా ప్రచారము చేయవలసిన ఆవశ్యకత యున్నదనియు, ఇతర రాష్ట్రములలో కూడ భక్తులు, సత్యనారాయణ వ్రతము చేసుకొనుచున్నారనీ, గనుక ఆ దిశగా కూడా యింకా ప్రచారము చేయవలయునని ఉద్బోధించారు.

పిమ్మట విశాఖపట్టణమును చేరి, కొందరి భక్తుల యిండ్లను సందర్శించారు. సాయంకాలమున స్థానిక గురజాడ కళాక్షేత్రమున, బేతవోలు రామబ్రహ్మంగారి ఆధ్వర్యంలో బ్రహ్మాండముగా బహిరంగ సభాకార్యక్రమములు నిర్వహించబడినాయి. చీఫ్ కమీషనరు ఆఫ్ ఇన్‌కమ్‌టాక్స్ వారు పాల్గొనిన యీ సభయందు, డా॥. భాగ్యారావుగారు, శ్రీ ఎమ్.ఎస్.ఆర్.కె. మూర్తిగారు, వైస్‌ప్రెసిడెంట్, స్థానిక ఆశ్రమ ట్రస్ట్‌బోర్డు, మాతృమండలి తరఫున శ్రీమతి సీతమ్మగారు స్వాగతవచనములు, తమ తమ ట్రస్టులు నిర్వహిస్తున్న కార్యక్రమ వివరములు తెలిపారు. దత్తపీఠబంధు శ్రీ వేమకోటి కృష్ణయాజిగారు తమకు శ్రీస్వామీజీతో గల అనుభవములను,

శ్రీస్వామీజీకి తమ భక్తుల యెడ గల అనుబంధములను సోదాహరణముగా సభకు వివరించారు. పిమ్మట తమ అనుగ్రహభాషణమున శ్రీస్వామీజీ యోగమును గురించి వివరించి, లతాంగిప్రియరాగములో ఐం హ్రీం శ్రీం కీర్తనను, విశ్వశాంతి గీతికను వినిపించారు. బెంగుళూరు ఆశ్రమములో చేపట్టిన బధిర, మూగ పిల్లల పాఠశాలను గురించి వివరించారు. వచ్చే నవంబరు నెలలో యీ పాఠశాల వృద్ధికై ఒక 'ఛారిటీ మ్యూజిక్ కాన్సర్ట్' ను విశాఖపట్టణంలో చేస్తానని చెప్పారు. పిమ్మట స్థానిక శ్రీగణపతి సచ్చిదానంద దత్త జ్ఞానబోధసభ ట్రస్టు వారు, అవధూత దత్తపీఠము నిర్వహిస్తున్న వైద్యశాల అభివృద్ధికోసం ఒక లక్ష రూపాయిలను శ్రీస్వామీజీకి సమర్పించినారు. మాతృమండలి సభ్యులు వస్త్ర సమర్పణ గావించారు. డా॥. ఎస్. నరహరిగారి వందన సమర్పణతో నాటి సభ పరిసమాప్తమైంది.

దీ. 24.1.03 న హోస్టుకమిటీని ఆశీర్వదించి, స్థానిక ట్రస్టునందు కొన్ని మార్పులుచేసి, మున్ముందు నిర్వహించవలసిన కార్యక్రమములను నిర్దేశించి, తగు సూచనలిచ్చారు. పిమ్మట యిరువురి భక్తులయిండ్లను సందర్శించి, శ్రీ ఎమ్.ఎస్. ఆర్.కె.మూర్తిగారి యింట శ్రీచక్రపూజ నిర్వహించి, శ్రీకాకుళమునకు బయలుదేరి వెళ్ళారు.

**శ్రీకాకుళము : 'చిం' దత్తనాథ క్షేత్రము**

దీ. 24.1.03 న మధ్యాహ్నం సుమారు 12 గంటలకు స్థానీయులు సాంప్రదాయకరీతిలో స్వాగతాలు పలుకుతుండగా, నాగావళీ నది తీరమున నెలకొన్న 'చిం' దత్తనాథుని క్షేత్రము చేరుకున్న శ్రీ స్వామీజీ; క్షేత్రము యొక్క దేవాలయ సముదాయమునకు, నూతనముగా నిర్మాణముచేసిన ముఖమండపమునకు ఉద్ఘాటన చేసి, నిర్మాణదాతలను, ఇంజనీర్లను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమమున స్థానిక ప్రముఖులు శ్రీ వరంగారు, శ్రీ కూర్మాచారిగారు పాల్గొన్నారు. పిమ్మట గత మూడు రోజులుగా జరుగుచున్న క్రియాయోగ తరగతుల ముగింపు సమావేశమునకు విచ్చేసి, తమ అనుగ్రహ భాషణమున సాధకులు ప్రతి ఒక్కరును నియమము తప్పకుండా తీసుకొనవలసిన ప్రాథమిక, నైతిక, క్రమశిక్షణా విధముల ఆవశ్యకతను గురించి వక్కాణించారు. ఇందు ఏ మాత్రము అజాగరూకత చేసిన యెడల కలుగు అనర్థముల గూర్చి వివరించి హెచ్చరించిరి.

సాయంకాలము నూతన నిర్మిత ముఖమండపమున జరిగిన స్వాగతసభకు ముఖ్యఅతిథిగా ఎక్సైజు, కస్టమ్స్ శాఖామాత్యులు శ్రీతమ్మినేని సీతారాంగారు విచ్చేశారు. జిల్లా న్యాయమూర్తులు శ్రీగణేష్‌రాథోడ్, మున్సిపల్ ఛైర్ పర్సన్ శ్రీమతి పైడిశెట్టి జయంతిగారు కూడా యీ సభయందు పాల్గొన్నారు. శ్రీచక్ర పూజానంతరము

శ్రీ ఎన్. లక్ష్మణరావుగారి వితరణగా ముద్రితమైన 'దత్త కుటుంబం' అనే చిన్న పుస్తకమును శ్రీస్వామీజీ ఆవిష్కరించారు. ఇందు ప్రతి దత్తభక్త కుటుంబము అవశ్యము ఆచరించవలసిన శ్రీస్వామీజీ సూచించిన ఆదర్శవిధులు, శ్రీస్వామీజీ ఫోటోలు ముద్రితమై వున్నాయి. శ్రీస్వామీజీ స్వయముగా రూ. 5. లు చెల్లించి, ఈ కార్యక్రమ ప్రారంభోత్సవము గావించినారు.

మరునాడు ది. 25.1.03 న ఉదయం కొంతమంది భక్తులయిండ్లను సందర్శించిన పిమ్మట శ్రీచక్రపూజ గావించారు. పిమ్మట దత్తజ్ఞానబోధసభ, శ్రీకాకుళం వారి ఆధ్వర్యంలో ఒక విద్వత్సభ నిర్వహించబడింది. ఇందు శ్రీకాకుళము, విజయనగరము, విశాఖపట్టణ జిల్లాలనుంచి వేద, సాహిత్య, పద్య, ఆగమ, హరికథ, సంగీత, ఆయుర్వేద మొదలైన శాస్త్రములందు నిష్ణాతులైన 75 మంది పండితులకు, ప్రముఖ ఆగమ, మంత్ర శాస్త్ర విద్వాంసులు, దత్తపీఠబంధు శ్రీ వేమకోటి కృష్ణయాజిగారికి, శ్రీస్వామీజీకి చిరకాలంగా ప్రియభక్తులు శ్రీకూర్మాచార్యులు మొదలైనవారలకు సన్మాన సత్కారములు చేశారు. ఈ సభయందే శ్రీ కానిన వెంకటేశ్వరరావు గారు రచించిన 'జైగణేశ' పుస్తకావిష్కారము కూడా జరిగింది. ఇందు భారతదేశమందలి ప్రముఖ ప్రఖ్యాత గణపతి దేవాలయముల వివరములు పొందు పరచబడినవి. సాయంకాలం దివ్యనామసంకీర్తన జరిగినది.

మరునాడు ది. 26.1.03 న శ్రీచక్ర పూజానంతరము, శ్రీకిమిడి సత్యనారాయణ నాయుడు, రెగిడి గ్రామవాస్తవ్యులు, శ్రీకాకుళంజిల్లా వారికి, వారి గ్రామ శివాలయమునందు ప్రతిష్ఠించుటకు 'మరకత గురుపాదుకలను' అనుగ్రహించారు. ఆశ్రమ సమీపములోని సిద్ధి బుద్ధి సహిత వినాయక దేవాలయమును సందర్శించారు. పిమ్మట కొంతమంది భక్తుల ఇండ్లను సందర్శించి, ఆశ్రమములో దత్తునకు తైలాభిషేకము చేశారు. ఈ సందర్భముగా, ప్రప్రథమముగా ఉత్సవమూర్తికి స్వయముగా అభిషేకము చేయుటకు భక్తులకు అనుమతినివ్వబడింది.

సాయంకాలం హోస్టుకమిటీ సభ్యులను ఆశీర్వదించి అనుగ్రహించారు. పిమ్మట శ్రీస్వామీజీ చిరకాల ప్రియభక్తులు, మాజీకేంద్రమంత్రి మరియు ఒరిస్సా మాజీ ముఖ్యమంత్రి, శ్రీగిరిధర గొమాంగో గారు తమ సభ్యబృందముతో మధురమైన విశేష సంగీత సేవను సమర్పించినారు. ఇందు శ్రీగిరిధర గొమాంగో గారు సుర్‌మండల్, డోలక, సాంప్రదాయక జానపద డ్రమ్ములు, మరియు కొన్ని పాత్రలతో లయబద్ధంగా వాయిద్య కచేరీ చేసి అందరినీ ఆశ్చర్యముగ్ధులను చేశారు. పిమ్మట శ్రీ చైత్రా వారణాసి, శ్రీ మహేష్‌భట్‌గార్ల వాయిద్య సహకారంతో శ్రీమతి సాయిలీల, శ్రీమతి పుష్పలతా పండా గార్లు భక్తి గీతముల నాలపించినారు. శ్రీ గొమాంగో గారు శ్రీస్వామీజీతో

తమ అనుభవాలను, తమ సంగీత జీవనము ఎలా ప్రభావితమయినది సభకు వివరించారు. శ్రీవరద గోవిందరాజులు, ఆశ్రమ సీనియర్ ట్రస్టీ మరియు శ్రీమతి పైడిశెట్టి జయంతి, మునిసిపల్‌ఛైర్‌పర్సన్ గార్లు కళాకారులను సన్మానించారు. తదుపరి జరిగిన స్వామీజీవారి దివ్యనామ సంకీర్తనయందు శ్రీగిరిధర గొమాంగో గారు తమ వాయిద్య సహకారమును అందించినారు. ఈ కార్యక్రమమునకు ముందు వివిధ స్థానిక సంస్థల ప్రతినిధులు, చుట్టుప్రక్కల 15 గ్రామములనుంచి వచ్చిన భక్తులు శ్రీస్వామీజీకి 'పుష్పాంజలి' ని సమర్పించినారు.

దీ. 27.1.03 న జరిగిన వాలంటీర్ల సమావేశమందు వారి సేవానిరతిని అభినందిస్తూ, సేవాభావముతో పాటు మనకు సంక్రమించిన సాంప్రదాయక రీతులను, నైతిక విలువలను మరచి పోరాదని, విడనాడ కూడదని శ్రీస్వామీజీ ఉద్బోధించారు. పిమ్మట స్థానిక ట్రస్టుకు ఒక లక్ష రూపాయిలు విరాళముగా ఇచ్చారు. శ్రీఅంధవరపు వరాహ నరసింహంగారు యాగశాల నిర్మాణమునకు, శ్రీవరద కొండబాబుగారు గురునిలయ ప్రాంగణమున వైద్యశాల భవన నిర్మాణమునకు తమ అంగీకారమును తెలిపారు. పిమ్మట శ్రీస్వామీజీ నెల్లూరు క్షేత్రమునకై బయలుదేరి వెళ్ళారు.

**నెల్లూరు : 'నం' దత్తనాథ క్షేత్రము**

విశాఖపట్టణం నుంచి విమానములో బయలుదేరి చెన్నై విమానాశ్రయమునకు దీ. 27.1.03 మధ్యాహ్నం 3.45 గం॥కు చేరుకున్న శ్రీస్వామీజీకి, భక్తులు హృదయపూర్వక స్వాగతము పలికారు. విమానాశ్రయమునుంచి నేరుగా నెల్లూరుకి బయలుదేరిన శ్రీస్వామీజీ మార్గమధ్యంలో వెంకటాచల గ్రామమున ఆగి, అచ్చట శ్రీ త్రిపురనేని కృష్ణప్రసాదు గారు నిర్వహించుచున్న 'సైబర్ గ్రామీణ సెంటరు'ను సందర్శించినారు. ఈ సెంటరునందు పొందుపరచిన కంప్యూటరు ద్వారా చుట్టుప్రక్కల గ్రామీణులకు, రైతులకు ఆ ప్రాంతపు భూమిపట్టా వివరములు, శిస్తు చెల్లింపులు, బ్యాంకింగు వ్యవహారములు, వ్యవసాయ అవసరాల కొనుగోలు, వైద్య సలహాలు మొదలగునవి అన్నీ ఆన్‌లైన్ ద్వారా తెలుసుకొని, తగు ప్రయోజనములు క్షణములలో పొందగలుగు చున్నారు. ఇటువంటి సెంటర్లను చక్కగా వినియోగించుకొంటే గ్రామప్రాంతాభివృద్ధి త్వరగా జరుగగలదని శ్రీస్వామీజీ అభిప్రాయపడినారు. ఆ రాత్రికి నెల్లూరు ఆశ్రమ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ, స్వామీజీ ప్రియభక్తులు అయిన శ్రీ వెంకటరామిరెడ్డిగారి ఇంటియందు విశ్రమించారు.

మరునాడు దీ. 28.1.03 ఉదయం కొంతమంది భక్తుల యిండ్లను సందర్శించి, 10 గంటలకు నెల్లూరు ఆశ్రమము చేరుకొన్నారు. శ్రీచక్రపూజానంతరము అనుగ్రహభాషణ చేశారు. సాయంకాలం సత్సంగ కార్యక్రమము జరిగింది. 29,

30 వ తారీఖులయందు ఉదయం శ్రీచక్రపూజ, హోమము, సాయంకాలము సత్సంగ కార్యక్రమములు జరిగినాయి. ది. 31.1.03 న అష్టలక్ష్మి అమ్మవారికి క్షీరాభిషేకము నిర్వహించి, విజయవాడకు బయలుదేరారు.

**కొండపావులూరు**

ఇక్కడ శ్రీస్వామీజీ వారి ఆజ్ఞతో శ్రీ బాలస్వామివారు ది.7.2.03 న శుక్రవారం ఉదయం 9 గంటలకు, శ్రీ అనఘాదేవీ సమేత దత్తాత్రేయస్వామి మరియు అభయాంజనేయస్వామి, నవగ్రహములు, నాగదేవతల ప్రతిష్ఠ, కుంభాభిషేకాది కార్యక్రమములు చేశారు. ఈ ప్రతిష్ఠా కార్యక్రమాలకు దత్తపీఠ ఆస్థాన విద్వాన్ బ్రహ్మశ్రీ మద్దూరి వేంకటేశ్వర యాజులుగారు అధ్వర్యం వహించగా, దత్తపీఠ ఆస్థాన విద్వాన్ శ్రీ కూచిభొట్ల చంద్రశేఖర శర్మగారు బ్రహ్మత్వం వహించారు. విజయవాడ భక్తులు పి.నాగేశ్వరరావు గారు సహాయ సహకారాలు అందించారు. దత్తపీఠ విద్యాధికారి శ్రీకుప్పా కృష్ణమూర్తిగారు, ఆశ్రమవాసి శ్రీ గణేశ్ ప్రసాద్ అవధానిగారు ఈ ఉత్సవానికి హాజరయ్యారు.

**మచిలీపట్టణం : అత్రివరద రాజ దత్తాత్రేయ క్షేత్రము**

ది. 17.2.2003 మధ్యాహ్నం గం॥ 11.55 ని॥లకు అనఘాసమేత అత్రివరద దేవాలయ 12 వ వార్షికోత్సవము, స్వామివారికి కుంభాభిషేకము శ్రీస్వామీజీ దివ్యహస్తముల మీదుగా, కనులపండుగగా జరిగింది. ఈ సందర్భంగా చేసిన అనుగ్రహభాషణమున శ్రీస్వామీజీ, మచిలీపట్టణ ఆశ్రమ ప్రధాన దాతలగు శ్రీ గజ్జల వీరరాఘవస్వామి, శ్రీమతి సీతమ్మ దంపతుల సేవలను తలచుకొని, కొనియాడారు. సాయంకాలం స్థానిక ప్రముఖులు, వైఖానస ఆగమ ఉద్దండులు, వయోవృద్ధులు అయిన శ్రీ వేదాంతం అనంతపద్మనాభాచార్యులుగారు నిర్వహిస్తున్న వైఖానస ఆగమ పాఠశాల, హయగ్రీవ దేవాలయములను సందర్శించి, స్థానిక హిందూకళాశాల సువిశాల ప్రాంగణములో సత్సంగ మరియు దివ్యనామ సంకీర్తనా కార్యక్రమములను నిర్వహించారు 18.2.03 నాడు కూడ ఉదయం శ్రీచక్రపూజ, హోమం ఆశ్రమములో జరిగాయి. సాయంత్రం హిందూకళాశాలలో దివ్యనామ సంకీర్తన జరిగింది..

**గుంటూరు 'దం' దత్తనాథ క్షేత్రము**

ది. 19.2.03 ఉదయం మచిలీపట్నం నుండి బయలుదేరి, మార్గమధ్యంలో విజయవాడ ఆశ్రమంలోని మరకత రాజరాజేశ్వరి అమ్మవారిని దర్శించి, గుంటూరు చేరిన శ్రీస్వామీజీకి గుంటూరు ఆశ్రమ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ, ప్రముఖ చార్టర్ ఎకౌంటెంటు అయిన శ్రీ గోపీకృష్ణ గారు, స్థానిక ట్రస్టీలు, భక్తులు, శ్రీగోపీకృష్ణ గారు నిర్వహిస్తున్న

అనాథాశ్రమవాసులు స్వాగతాంజలులు పలికారు. ఈ అనాథాశ్రమము త్వరలో దత్తపీఠ ట్రస్టు ఆధ్వర్యములోనికి రానున్నది.

ఆ రోజునే కొంతమంది భక్తుల ఇండ్లను సందర్శించి, సమీప గోరంట్ల గ్రామములో శ్రీ వేంకటేశ్వర దేవాలయమును సందర్శించారు. సాయంకాలం స్థానిక బృందావన గార్డెన్సులో నెలకొన్న బాలాజీ దేవాలయమును సందర్శించి, శ్రీ యర్రాప్రగడ సుబ్బారావు గారు రచించిన 'అపరోక్షానుభూతి' అనే పుస్తకమును ఆవిష్కరిస్తూ, "ప్రతి వ్యక్తి అంతర్మథనము చేసుకొంటే తప్ప శాశ్వతమైన ఆ ఈశ్వరానుభూతి రాదని, ప్రపంచ విషయానుభూతుల నశ్వరత్వము అవగతమవుతుంద"ని ఉద్బోధించారు. అక్కడనుండి స్థానిక ఎన్.టి.ఆర్.స్టేడియంలో శ్రీ బొల్లా సత్యనారాయణగారి ఆధ్వర్యములో జరుగబోయే స్వాగతసభకు తరలి వెళ్ళారు. ఆనాటి స్వాగతసభలో ముఖ్య అతిథులుగా విచ్చేసిన గుంటూరుజిల్లా న్యాయమూర్తి శ్రీ వేంకటేశ్వరరెడ్డి గారు, మాజీ మంత్రివర్యులు శ్రీ మహమ్మద్‌జానీ గారు శ్రీస్వామీజీవారి ఆధ్వర్యములో బడుగు జనోద్ధరణకై నిర్వహించబడుతున్న అనేక సేవాకార్యక్రమములను కొనియాడారు. శ్రీస్వామీజీ వారి సర్వమతాసామ్యమును అభినందిస్తూ, ఆ దిశలో యింకను వారి కార్యక్రమములు దిగ్విజయముగా జరుగువలెనని అభిలషించారు. శ్రీస్వామీజీ తగు రీతిలో స్పందిస్తూ, తమ అనుగ్రహ భాషణమును చేశారు.

దీ. 20.2.03 న శ్రీచక్రపూజానంతరము, స్థానిక ట్రస్టీలతో సమావేశమై, జరుగబోయే ప్రతిష్ఠా కార్యక్రమ నిర్వహణ సమీక్షించి, తమ సూచనలను చేశారు. సాయంకాలం పత్రికా గోష్ఠి, సత్సంగ కార్యక్రమము జరుపబడినాయి.

దీ. 21.2.03 గుంటూరు ఆశ్రమ చరిత్రలో సువర్ణాక్షరములతో లిఖించదగిన పుణ్యదినం. గత 25 సం॥లుగా గుంటూరు, పరిసరవాస భక్తులు చేస్తున్న తపస్సిద్ధి ఫలదినం. శ్రీస్వామీజీ దివ్యహస్తములతో ప్రతిష్ఠిస్తున్న నవనాథ క్షేత్రములో చివరిది, మరియు 32 వ దత్తదేవాలయము ఈ శుభదినమున ప్రతిష్ఠింప బడుతున్నది. ఉదయం 8 గం॥ 6 ని॥లకు శ్రీస్వామీజీచే గణపతి, దత్తాత్రేయ, అనఘాదేవి, రాజరాజేశ్వరీ మూర్తులకు యంత్రప్రతిష్ఠ జరుపబడినాయి. పిమ్మట శ్రీచక్రార్చనానంతరం ప్రధాన దాతల సత్కారం, నవనాథ స్తోత్ర ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించబడినాయి. గం. 11.30 కు యాగశాలలో పూర్ణాహుతి గావించి, శ్రీస్వామీజీ వరుసగా గణపతి, రాజరాజేశ్వరీ దేవాలయాల కుంభాభిషేకము గావించారు. గం 12.15 లకు అనఘాసమేత 'దం' దత్తనాథ దత్తాత్రేయ స్వామివారి కుంభాభిషేకము గావించారు. ఈ మహోత్సవమును తిలకిస్తున్న వేలాది

ప్రజలనుద్దేశించి శ్రీస్వామీజీ భక్తిప్రపత్తులతో, నిష్కల్మషమైన, శుద్ధమైన జీవనాన్ని గడపాలని ఉద్బోధించారు. అటు పిమ్మట నూతన ప్రతిష్ఠితాలైన గణపతి, రాజరాజేశ్వరీ, దత్తాత్రేయ, అనఘా మూర్తులకు అభిషేకము గావించారు. హైదరాబాదు ఆశ్రమములో నిర్వహించ తలబెట్టిన 'అమ్మ ఒడి' ట్రస్టీలు మధ్యాహ్నం శ్రీస్వామీజీ వారిని కలిసి, ఆ ప్రాజెక్టుకై తయారయిన భవన సముదాయ ప్లానును సమర్పించి, శ్రీవారి ఆశీస్సులను గైకొన్నారు. సాయంకాలం దివ్యనామ సంకీర్తన జరిగింది.

గమనిక : తమ దత్తక్షేత్ర యాత్రలో వివిధ క్షేత్రములలో శ్రీస్వామీజీవారి అనుగ్రహభాషణములు విడిగా రాబోయే సంచికలలో ప్రచురించబడును - ఎడిటర్.

## క్రియాయోగ తరగతులు

ఈ క్రింది తేదీలలో వివిధ ఆశ్రమాలలో క్రియాయోగ తరగతులు నిర్వహించబడును. చేరదలచిన భక్తులు ఆయా జ్ఞానబోధసభలను సంప్రదించ వచ్చును. లేదా యీ క్రిందివారిని సంప్రదించ వచ్చును.

శ్రీరాజారావు, హైదరాబాదు — ఫోన్ నెంబరు 040/55667700
శ్రీ గోపాలకృష్ణ, మైసూరు — ఫోన్ నెంబరు 0821/484999

| స్థలము | నెల | నుండి | - | వరకు |
|---|---|---|---|---|
| 1) వి.డి.యల్. హైదరాబాదు | జూన్ | ది. 6 | - | ది. 8 |
| 2) బి.హెచ్.ఇ.యల్. హైదరాబాదు | జులై | " 4 | - | " 6 |
| 3) నూజివీడు | జులై | " 15 | - | " 17 |
| 4) ఏలూరు | జులై | " 18 | - | " 20 |
| 5) రేగిడి(శ్రీకాకుళంజిల్లా) | జులై | " 22 | - | " 24 |
| 6) శ్రీకాకుళం | జులై | " 25 | - | " 27 |
| 7) పిఠాపురం | ఆగష్టు | " 8 | - | " 10 |
| 8) వరంగల్ | ఆగష్టు | " 12 | - | " 14 |
| 9) దిండిగల్ (హైదరాబాదు) | ఆగష్టు | " 15 | - | " 17 |
| 10) నెల్లూరు | ఆగష్టు | " 29 | - | " 31 |

# శ్రీస్వామీజీవారి ఆంధ్రప్రదేశ్ యాత్రా విశేషములు

నివేదిక : శ్రీ హెచ్.వి.ప్రసాద్ అనువాదం : డా॥ హరగోపాల్

## శ్రీమరకత రాజరాజేశ్వరీ అమ్మవారి మండలపూజ

ఢిల్లీలోని 'గం'దత్తనాథ క్షేత్రయాత్ర ముగించుకొని ది. 17.3.2003 న విజయవాడకు చేరిన శ్రీస్వామీజీ స్థానిక భక్తులు భక్తిపూర్వక స్వాగతములు పలికారు. అనంతరం గతమూడు రోజులుగా శ్రీ గోపాలకృష్ణ, రాజారావు గార్ల, జయలక్ష్మీమాతృమండలి, విజయవాడ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన, క్రియాయోగా శిక్షణా తరగతులు ముగింపు సభకు విచ్చేసి, తమ ఆశీస్సులను అందజేశారు.

**18.3.2003 ఫాల్గుణ పూర్ణిమ**

ఈ శుభదినాన శ్రీమరకత రాజరాజేశ్వరీ అమ్మవారి మండలపూజలు శ్రీ మద్దూరి వేంకటేశ్వరయాజులవారి ఆధ్వర్యంలో వేదపండితులతో నవచండీ హోమంతో ప్రారంభమైనాయి. ఉదయం 9 గంటలకు శ్రీచక్రపూజానంతరం ప్రముఖ పాత్రికేయులు, సంపాదకులు, శ్రీ వి. వాసుదేవ దీక్షితులు రచించిన 'మరకతలాస్యము' అనే పుస్తకావిష్కరణ గావించారు. ఇందు మరకత రాజరాజేశ్వరీ అమ్మవారి అవిర్భావచరిత్ర, అమ్మవారి ప్రాముఖ్యత, ఈ నిర్మాణ సమయమున వివిధ కార్యకర్తలకు అనుభవమైన విశేష అనుభూతులు వివరించబడినాయి. అసలు యీ పుస్తకావిర్భావమే శ్రీస్వామీజీవారి దివ్యానుగ్రహంగా అనుభూతమైనదనీ, తామెల్లరం శ్రీవారి చేతి పనిముట్లు మాత్రమే అనీ, శ్రీదీక్షితులు గారు సవినయంగా పలికారు. పిమ్మట మరకత శిలప్రదాత శ్రీగఫూర్‌గారికి సన్మానము జరిగింది.

ఈ ప్రతిష్ఠా కార్యక్రమ భాగంగా నిర్వహించిన 'శ్రీమాతా నామలేఖన యజ్ఞం'లో పాల్గొని సుందరము గాను, స్పష్టముగాను, వ్రాసిన కుమారి వి. ప్రసీద, విజయవాడ భక్తురాలికి మొదటి బహూమతి, శ్రీ సురేష్, మైసూరు ఆశ్రమవాసికి ప్రత్యేక బహూమతి, మరి ఇతర తొమ్మిదిమందికిని బహుమతులను అందించి, ఆశీర్వదించారు. ఈ యజ్ఞ ప్రదాతలను ఆశీర్వదించారు.

నామకోటి మండపము :

శ్రీస్వామీజీ ఆదేశానుసారం కేవలం 40 రోజులలోనే నిర్మితమైన ఈ మండపాన 'శ్రీమాతానామలేఖనము' లన్నియును యంత్ర సహితముగా వుంచబడింది. ఈ మండప ప్రదక్షిణం వల్ల విద్యార్థులకు మంచి విద్య, జ్ఞాపకశక్తి కలుగుతుందనీ, సాధకులకు మంత్రసిద్ధి, వైరాగ్యసిద్ధి త్వరితముగా లభించగలదనీ, శ్రీస్వామీజీ అనుగ్రహించారు. ఈ మండప నిర్మాణ సేవాకర్తలు శ్రీ ఆర్. మధుసూదనరావు, శ్రీమతి సులోచనారాణి, శ్రీ యు.వి.శివాజీ గార్లను అభినందించారు. ఈ మండప ఉద్ఘాటన ఈరోజు సాయంకాలము జరిగింది.

పిమ్మట నవ చండీహోమ పూర్ణాహుతిని గావించి, శ్రీ రాజరాజేశ్వరీ అమ్మవారిని పవిత్ర కలశ జలములతోనూ, 108 కలశాల క్షీరముతోనూ అభిషేకించారు. పిదప అమ్మవారిని స్వర్ణాభరణాలతోనూ, స్వర్ణ కవచముతోనూ, అలంకరించి మంగళహారతులిచ్చారు. వేలాది భక్తులు తిలకించిన యీ కార్యక్రమానంతరం మండల పూజయందు తమవంతు సేవలందించిన వేదపండితులను సత్కరించారు.

సాయంత్రం, నాదనిధి శ్రీ అన్నవరపు రామస్వామిగారు నవావరణ దేవీ భజనలు (త్రిపురావైభవము) పాడినారు. పిమ్మట మరకత జ్యోతిదర్శనం, దోలోత్సవం, అష్టావధాన సేవలతో మండల పూజోత్సవాలు ముగిశాయి..

**19.3.2003 :**

ఉదయం శ్రీచక్రపూజానంతరం, శ్రీస్వామీజీ తమ అనుగ్రహభాషణమున, మానవుడి దైనందిక చర్యలు యీ కాలాన ఎలా వున్నాయో వివరిస్తూ, అందలి లోటుపాటులను సరిదిద్దే మార్గాలను సూచించారు. సాయంకాలం, శ్రీ పాలపర్తి శ్యామలానంద ప్రసాదు గారు రచించిన 'శ్రీస్వామీజీ జీవిత చరిత్ర' భరతనాట్య ప్రదర్శన జరిగింది. తరువాత చిన్న పిల్లలచే నృత్య ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా శ్రీస్వామీజీ మాట్లాడుతూ , "శ్రీస్వామీజీ గురించిన చరిత్ర రచనలకు సంబంధించిన నృత్య ప్రదర్శనలకు, ముందుగా తప్పనిసరిగా, దత్తపీఠంనుంచి అనుమతి పొందాలని, నర్తకీ, నర్తకులు ఎవరైనా శ్రీస్వామీజీని గాని, వారిచర్యలను గాని అనుకరించ రాదని నిర్దేశించారు. శ్రీస్వామీజీవారి బాల్యాన్ని అభినయించ వచ్చునని, ఆ తరువాత వీడియో క్లిప్పింగులు మాత్రమే ప్రదర్శించాలని ఆజ్ఞాపించారు.

**20.3.2003 :**

శ్రీచక్రపూజానంతరం సిల్వెస్టరు అనే కళాకారుని మిమిక్రీ ప్రదర్శన, సాయంకాలం గురుపూజా కార్యక్రమము జరిగింది. తదుపరి దివ్యనామ సంకీర్తనయందు శ్రీస్వామీజీ కొన్ని అద్భుత హనుమంతుని కీర్తనలను పాడారు.

**21.3.2003 :**

శ్రీచక్రపూజానంతరం, అమ్మవారికి శుక్రవార అభిషేకం, రాహుకాల పూజ జరిగాయి. ఈ రోజు సంకష్టహర చతుర్థి సందర్భంగా సాయంకాలం క్షిప్రగణపతికి అభిషేకం, రజత కవచాలంకరణానంతరం, మోదకార్చన శ్రీస్వామీజీవారిచే జరుపబడింది. పిమ్మట దివ్యనామ సంకీర్తనం జరిగింది. జ్ఞానబోధసభ సభ్యుల అభ్యర్థనకు తమ 64 వ దిగ్విజయ విదేశీయాత్ర సందర్భంగా శ్రీస్వామీజీ 'కేకు కటింగు' చేశారు. తదుపరి శివా, మిత్రబృందం తమ హాస్యప్రదర్శనచే భక్తులను కడుపుబ్బ నవ్వించారు. దీనితో మండల పూజా ఉత్సవాలు ముగిశాయి.

**22.3.2003 కామారెడ్డి : 'దం' దత్తనాథక్షేత్రము :**

విజయవాడనుంచి బయలుదేరి, సాయంకాలం 4.30 గంటలకు కామారెడ్డి చేరుకున్న శ్రీస్వామీజీకి స్థానిక ట్రస్టీలు, భక్తులు నగర పొలిమేరలలోనే భక్తిపూర్వక స్వాగతాంజలులు ఘటించి, ఊరేగింపుగా స్వాగత సభకు తీసుకొని వెళ్ళారు. స్థానిక జ్ఞానబోధసభ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ డా॥. బి. ఈశ్వరదాసుగారు, స్వాగతం పలికి, తమ సభ నిర్వహించిన కార్యక్రమాలను వివరించారు. డా॥. అయాచితం నటేశ్వరశర్మగారు శ్రీస్వామీజీకి సంస్కృతశ్లోక స్వాగత పత్రాన్ని సమర్పించారు. ట్రస్టీలు గంగాధర్, సీతారామరావుగార్లు పుష్పమాలలను, మాతృమండలి సభ్యులు సువర్ణాభరణమును, శ్రీస్వామీజీకి సమర్పించారు. కార్యకర్తలు స్వాగత గీతికలను ఉత్సాహముగా గానం చేశారు. శ్రీస్వామీజీ తమ సందేశాన్ని అనుగ్రహిస్తూ "గురూపదేశం గురించి ఒక కథను వివరించి, సద్గురువు సాన్నిధ్యం, ఆవశ్యకతను గుర్తించుకోవాలనీ, ఉద్బోధించారు. తదుపరి కాగడాహారతితో నేటి కార్యక్రమాలు ముగిశాయి.

**23.3.2003 :**

ఉదయం శ్రీచక్రపూజానంతరం, స్థానిక ట్రస్టీలు శ్రీస్వామీజీ అంగీకారంతో ఒక భూదాన కార్యక్రమాన్ని ప్రకటించారు. దీని ద్వారా వచ్చిన ధనంతో ఆశ్రమప్రక్క స్థలాలను కొని అన్నదాన మందిరం, సభామండపం నిర్మిస్తామని ప్రకటించగా, అక్కడకు విచ్చేసిన వేలాది భక్తసందోహం యీ వితరణ కార్యక్రమంలో అత్యంతోత్సాహాలతో పాల్గొన్నారు. పిమ్మట మాష్టరు అనురాగ్ హనుమాన్ చాలీసా గానం జరిగింది. తమ అనుగ్రహభాషణమున శ్రీస్వామీజీ, ట్రినిడాడ్‌లో నిర్మితమవుతున్న హనుమాన్ ప్రాజెక్టును గురించి వివరించారు. 2004 సంవత్సరాన తెలంగాణా ప్రాంతంలో విస్తృతంగా పర్యటిస్తామని అనుగ్రహించారు. నిజామాబాదునందు జ్ఞానబోధసభ ప్రారంభించటానికి అనుమతించారు. పిమ్మట హోమసేవాకర్తలకు ప్రసాద వితరణ జరిగింది.

సాయంకాలం జరిగిన ట్రస్టు మీటింగులో, ఆశ్రమ కార్యక్రమములన్నింటినీ ఐకమత్యంతో నిర్వహిస్తున్న సభ్యులందరినీ అభినందించి, స్థానికంగా ఒక ట్రైబల్ చిల్డ్రన్‌కు ఒక స్కూలు, అనాథాశ్రమం నిర్మించటానికి తగు సూచనలను చేశారు. తదుపరి జరిగిన కార్యక్రమంలో అందముగా అలంకరించుకొన్న పిల్లలు శ్రీస్వామీజీవారి అవతార లక్ష్యాలను సంభాషణా రూపమైన గీతికలుగా పాడారు.

మరునాడు ఈ 'దం' దత్తనాథ క్షేత్రమునుంచి రామచంద్రాపురం (పటాన్‌చెరు)కు బయలుదేరారు.

**24.3.2003 పటాన్‌చెరు (రామచంద్రాపురం) :**

మధ్యాహ్నం 11.30 గంటలకు రామచంద్రాపురం చేరుకున్న శ్రీస్వామీజీవారి బస శ్రీ సర్రా నాగేశ్వరరావుగారి ఇంటియందు ఏర్పాటు చేయబడింది. సాయంకాలం జరిగిన ట్రస్టీ మీటింగునందు ఇచ్చట దేవాలయము, లైబ్రరీ, భక్తులకు వసతి గృహాలు హైదరాబాదులో అమ్మఒడి ప్రాజెక్టు పూర్తి అయిన పిదప చేయాలని ఆదేశించారు. అలాగునే గాణగాపురంలో గురుపాదుకా మందిరం, గురునిలయం, భక్తుల వసతి గృహం కూడా యీ ట్రస్టు చేపట్టాలని ఆదేశించారు. సభ్యులందరూ చురుకుగా పాల్గొని యోగ తరగతులు, వైద్యసేవా కార్యక్రమములు యింకా ఎక్కువగా చేపట్టాలని సూచన చేశారు.

సాయంకాలం ఆశ్రమంలో జరిగిన స్వాగతసభయందు దత్తపీఠ ఆస్థాన విద్వాంసులు బ్రహ్మశ్రీ కూచిభొట్ల చంద్రశేఖరశర్మ గారు శ్రీస్వామీజీ వారి అవతార లక్ష్యాలను గూర్చి భక్తజనులకు సవివరంగా వివరించారు. శ్రీ ఎ.ఎన్.జగదీశ్వరన్ గారు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు, బి.హెచ్.ఇ.ఎల్ మరియు శ్రీ ఎస్.వి. రమణమూర్తి గారు, ఇన్స్‌పెక్టర్ గారు జనరల్ ఆఫ్ పోలీస్, గౌరవ అతిథులుగా విచ్చేశారు. శ్రీస్వామీజీ దత్తపీఠం చేపట్టిన వివిధ కార్యక్రమాలను వివరించారు. అప్పుడు జరుగుతున్న రెండవ గల్ఫ్ యుద్ధం గురించి భయం లేదని సెలవిచ్చారు.

**25.3.2003 :**

ఉదయం శ్రీచక్రపూజ, హోమం, శ్రీ సర్రా నాగేశ్వరరావుగారి గృహమందు నిర్వహించబడినాయి. సాయంకాలం దివ్యనామ సంకీర్తన, మహాగణపతి హోమం, ఆశ్రమమందు జరుపబడినాయి. ఈ సందర్భంగా స్థానిక భక్తులు శ్రీస్వామీజీవారి 60 వ జన్మదినోత్సవమును ఆనందోత్సాహాలతో జరుపుకొన్నారు. ప్రార్థనామందిరంపైన గురునిలయం, అతిథిగృహం నిర్మించుటకు అనుమతినిచ్చారు.

ధ్యానచికిత్సా సంగీత విభావరి, హైదరాబాదు :

హైదరాబాదులో నూతనంగా అత్యాధునిక వసతులతోనూ, సౌందుస్సిస్టంతోనూ నిర్మించిన 'శిల్పారామం'నందు ది. 30.3.2003 న ధ్యానచికిత్సా సంగీత విభావరి నిర్వహించబడింది. ఈ ఆడిటోరియాన్ని చూసిన శ్రీస్వామీజీ ఇంత చక్కటి, ఇంటర్నేషనల్ స్టాండర్డులతో ఆడిటోరియాన్ని నిర్మించినందుకు శ్రీ చంద్రబాబునాయుడు, ఆం.ప్ర.ముఖ్యమంత్రిగారిని అభినందించారు. సంగీత కచేరీని, ఆం.ప్ర. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి శ్రీ దేవేంద్రగుప్తాగారు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. న్యాయమూర్తి శ్రీ సోమయాజులుగారు, కేంద్రమంత్రివర్యులు, శ్రీ బండారు దత్తాత్రేయ గారు, రాష్ట్రహోంశాఖామాత్యులు శ్రీ దేవేంద్రగౌడ్‌గారు, సినీనటులు శ్రీబ్రహ్మానందంగారు యిందులో అతిథులుగా పాల్గొన్నారు.

ఈ సంగీత విభావరిలో కేంద్రమంత్రివర్యులు శ్రీ బండారు దత్తాత్రేయ గారు శ్రీస్వామీజీకి వస్త్ర సమర్పణ చేయగా, ఆ.ప్ర. హోంశాఖామంత్రివర్యులు శ్రీ దేవేందర్ గౌడ్‌గారు మాలా సమర్పణ చేశారు. అనంతరం 'శాంతిసందేశం' అనే క్యాసెట్‌ను ఆ.ప్ర. హైకోర్టు జస్టిస్ శ్రీసోమయాజులుగారు రిలీజు చేశారు. భక్తులందరి పక్షాన హోస్టుకమిటీ సభ్యుడు శ్రీ బి. చంద్రమౌళి గారు పుష్పమాలను సమర్పించారు.

ఈ సంగీత విభావరిలో పాల్గొని వాద్య సహకారాన్ని అందించిన వారిలో నాదసిధి శ్రీ డా॥. ఎన్. రమణి (ఫ్లూట్), మొదలైన ప్రముఖులున్నారు.

ఈ కార్యక్రమానికి ఆడిటోరియం ఇన్‌చార్జిగా జెమినీ టెలివిజన్ శ్రీనాగేంద్రగారు వ్యవహరించారు.

దత్తపీఠ విద్యాధికారి బ్రహ్మశ్రీ కుప్పా వేంకట కృష్ణమూర్తిగారు సభకు శ్రీస్వామీజీవారి సంగీత చికిత్స గురించి, యిందు పాల్గొనుచున్న సంగీత విద్వాంసులను పరిచయం చేశారు. ప్రఖ్యాత సినీనటుడు శ్రీ ఎ.వి. ఎస్‌గారు కూడా శ్రీస్వామీజీ సంగీత చికిత్స గురించి మాట్లాడారు. ఈ సమయములోనే శ్రీస్వామీజీ సభికులకు అనేక రంగులతో మెరుస్తున్న స్ఫటికాలను ప్రదర్శించారు.

సంగీత విభావరి ప్రణవ స్వరూపమనే భజనతో ప్రారంభమై, సప్తాశ్వరూఢం, గురుపాదము, అమృతవర్షిణి మొదలగు భజనలతో సాగింది. తని ఆవర్తన సమయంలో శ్రీస్వామీజీ స్ఫటిక (క్రిస్టల్) దండముతో సభయంతా కలయతిరిగారు. తదుపరి ప్రముఖ హాస్యనటుడు బ్రహ్మానందంగారు కూడా శ్రీస్వామీజీతో తన అనుభవం గురించి కొద్దిసేపు మాట్లాడారు.

స్వభాను ఉగాది మహోత్సవము :

లేత కాషాయాంబరధారులై ప్రభాత దర్శనమిచ్చి, శ్రీస్వామీజీ దత్తపీఠ ముఖ్య సభ్యులకు ఉగాది పచ్చడి ప్రసాదమిచ్చి, శ్రీచక్రపూజ గావించి, సరిగా 6 గం.2 ని.లకు ఉగాది సందర్భంగా ప్రతి సంవత్సరము అనుగ్రహిస్తున్న గురుసందర్శన పాదుకాస్పర్శకై ఆసీనులయ్యారు. సుమారు 25000 కు పైగా విచ్చేసిన భక్తులకు ఉగాది పచ్చడి, లడ్డూ, అన్నప్రసాద వితరణ జరిగింది.

సాయంకాలం దత్తపీఠ, ఆస్థాన పంచాంగకర్త బ్రహ్మశ్రీ కుప్పా ఆంజనేయ శాస్త్రిగారిచే పంచాంగ శ్రవణ కార్యక్రమం శ్రీస్వామీజీవారి దివ్యసన్నిధిలో జరిగింది. తదనంతరం అమ్మఒడి ప్రాజెక్టు సభ్యులు శ్రీ అయ్యప్పన్, డా॥.డి.ఆర్.రావు, శ్రీ ఎస్.వి.రమణమూర్తి గార్ల సమక్షంలో అమ్మఒడి 3 D నమూనాను ఆవిష్కరించారు. ఈ ప్రాజెక్టు మొదటి దశయందు 200 మంది అనాథ స్త్రీలకు పునరావాస సదుపాయములు కలుగజేయాలని సంకల్పించారు. ఇందులో భాగంగా 60 కాటేజీలు, భోజనశాల, వంటగది, జనరేటరు రూము, ఉద్యానవనం, సెక్యూరిటీ రూము, ఉద్యోగస్థుల వసతిగృహ సముదాయం నిర్మించబడతాయని తెలియ జేశారు. ఈవిధంగా అమ్మఒడి ప్రాజెక్టు రూపు దిద్దుకుంటున్నందుకు శ్రీస్వామీజీ తమ సంతోషాన్ని, సంతృప్తిని, వ్యక్తం చేశారు. విరాళాలు అధికంగా సమకూరినచో ఈ ప్రాజెక్టు ఇంకా అభివృద్ధి పొందుతుందని శ్రీస్వామీజీవారు చెప్పారు.

తదుపరి దివ్యనామ సంకీర్తనా కార్యక్రమమునందు మొదమొదలు వందనము గణపయ్యా, దత్తాత్రేయ త్రిమూర్తిరూపా, ప్రసరతి చిత్తే, స్వభాను ఉగాదిపాట 'స్వాగతం స్వాగతం ఓ స్వభాను' మొదలగు భజనలను పాడి, ఉగాది పాట యొక్క అర్థాన్ని వివరించారు.

ద్వాదశవర్షములనంతరం దత్తావధూత దత్తాత్రేయునికి పునఃకుంభాభిషేక మహోత్సవం జరిగింది. బ్రహ్మ కలశధారులై శ్రీస్వామీజీ ముందుగా ఆలయ ప్రదక్షిణ గావించి, ప్రధాన దేవతామూర్తికే నేరుగా బ్రహ్మకలశాభిషేకం గావించారు. దీనికి ముందుగా ఉదయాన్నే యంత్రప్రతిష్ఠా కార్యక్రమం, యాగశాలయందు పూర్ణాహుతి కార్యక్రమం గావించారు.

ఈరోజు ఉదయాన అమ్మఒడి ప్రాజెక్టు మీటింగునందు ఇప్పటివరకు జరిగిన అభివృద్ధికి శ్రీస్వామీజీవారు సంతృప్తిని వ్యక్తం చేశారు. శ్రీచక్రపూజానంతరము శ్రీ నారాయణరావు (దేవాలయ ప్రథమ విరాళకర్త) శ్రీ రమణమూర్తి, శ్రీ పి.ఎస్.శాస్త్రి (కుంభాభిషేకము, దేవాలయ పునర్నిర్మాణమున ప్రధానదాత) గార్లను సన్మానించినారు. ఈ సందర్భముగా ఈ ఆశ్రమ స్థలానికి మొట్టమొదటగా విచ్చేసిన సందర్భాన్ని, అప్పటి ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ కీ.శే. శ్రీ గోపాలకృష్ణమూర్తి మరియు

సీనియరు ట్రస్టీ శ్రీ ఇ.మురళీ గార్ల సేవలను స్థలదాత శ్రీ రాధేశ్యామ్ గారిని స్మరించి, అభినందించారు.

**శ్రీరామనవమి మహోత్సవములు :**

ఉదయం శ్రీచక్రపూజానంతరం, శ్రీస్వామీజీ సమక్షంలో సీతారామ కళ్యాణం కడు వైభవంగా నిర్వహించబడింది. కళ్యాణ సమయంలో దత్తపీఠ విద్యాధికారి శ్రీ కుప్పా కృష్ణమూర్తిగారు చేసిన కల్యాణోత్సవ వ్యాఖ్యా ప్రసంగం ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. హారతి అనంతరం తమ సంక్షిప్త భాషణమున ఇలా చెప్పారు -

"రామాయణములోని అంతరార్థములను తెలుసుకొనే ముందు దాని సామాన్య అర్థమును పూర్తిగా అవగాహన చేసికోవాలి. పిమ్మట అంతరార్థాన్ని గూర్చి విచారిస్తే అంతా సులభముగా తేటతెల్లమవుతుంది. ఎప్పుడైతే మన మనస్సు, బుద్ధి కళ్యాణ ప్రదంగా ఒకటవుతాయో, అపుడు మనకు బ్రహ్మానందం మరియు బ్రహ్మలోకప్రాప్తి కలుగుతాయి. సీతారామ కళ్యాణమంటే యీ మనస్సు, బుద్ధుల కళ్యాణమన్నమాట. మన శరీరంలోనే రామాయణంలోని అంతరార్థాలున్నాయి. ఆత్మే రాముడు. బుద్ధే సీత. వారి సంగమమే ఆత్మానందం. బ్రహ్మనాడియే గంగ. నాడీమండలమే జీవనదులు. గ్రంథులే మహర్షులు. ఇడా, పింగళ నాడులను జయించుటయే అరిషడ్వర్గవిజయము. ప్రాణాయామమే ఆంజనేయస్వామి. మన బుద్ధిని జయించినచో జీవన్ముక్తి లభించును. సద్గురువర్యులే వశిష్ఠమహర్షి. గురుదేవులే విశ్వామిత్ర మహర్షి. వారి బోధన సహకారములతో ప్రాణాయామం, మరితర యోగాభ్యాసములను నేర్చుకోవాలి. ఈ పుణ్యదంపతుల కళ్యాణ ఘట్టమును కనులారా గాంచుటచే మనలో అంతర్మథన ప్రారంభమై, చెడుపై విజయం సాధించి సర్వమంగళ ప్రదమవుగాక. ఇప్పుడు గల్ఫ్‌లో యుద్ధం జరుగుతోంది. అక్కడి ఇరు పక్షాలకు మంచి జరగాలని, యుద్ధవాతావరణం తొలగి ప్రశాంతత త్వరగా నెలకొనాలని, సామాన్యుని జీవగతి సవ్యముగా సాగిపోవాలని శ్రీరాముని ప్రార్థిస్తున్నాను. జయగురుదత్త."

తదుపరి రామతారక హోమపూర్ణాహుతి, ఎర్రచందన కర్రయందు చెక్కబడిన లక్ష్మణ, ఆంజనేయసహిత సీతారాములకు హారతి గావించి, అమ్మఒడి ప్రాజెక్టును వివరించే చిన్నపుస్తకమును ఆవిష్కరించారు.

సాయంకాలం పార్లమెంటు సభ్యులు శ్రీ టి. సుబ్బరామిరెడ్డి, శివశ్లోక పఠన గావిస్తూ శ్రీస్వామీజీకి పుష్పాభిషేకము చేశారు. ఈ రోజుతో గతవారం రోజులుగా శ్రీస్వామీజీ గానం చేస్తున్న 'హనుమత్ సప్తాహ' కార్యక్రమము ముగిసినది. దత్తపీఠం

త్వరలో ఈ సప్తాహ ప్రవచనములను చాల భాషలలో పుస్తకరూపంగా వెలువరించనున్నది. హైదరాబాదు ట్రస్టీలు శ్రీస్వామీజీకి వస్త్రసమర్పణతో, గత 12 రోజులుగా జరిగిన మహోత్సవములు సమాప్తమైనవి. అనేక వేల భక్తులు అశ్రుపూరిత నయనాలతో తమ సద్గురు దేవులను వీక్షిస్తూ 'స్వామీనాథా, సచ్చిదానందా' అని భజన చేస్తుండగా, శ్రీగురుదేవులు నెమ్మదిగా గురునిలయమునకు నడిచి వెళ్ళినారు. 12 ఏప్రిల్ 2003 న హైదరాబాదునుండి చెన్నై పట్టణమునకు బయలుదేరి వెళ్ళారు.

## తమిళ ఉగాది సందర్భముగా శ్రీస్వామీజీవారి చెన్నై ఆశ్రమ సందర్శన

12 ఏప్రిల్ 2003 రాత్రికి హైద్రాబాదునుండి మద్రాసు ఆశ్రమానికి విచ్చేశారు.

13 తేదీ ఉదయం, శ్రీస్వామీజీ ఆకస్మికముగా తమ అత్యంత ఆత్మీయప్రియ భక్తులు కీ.శే. గోపాలన్‌గారి ఇంటికి వెళ్ళి అరగంటపైగా గడిపారు. శోకతప్తులైన ఆ కుటుంబ సభ్యులందరూ శ్రీస్వామీజీ రాకతో, వారి దివ్యసన్నిధిలో ప్రశాంతత నొందారు. పిమ్మట ప్రఖ్యాత సంగీత దర్శకులు శ్రీ మణిశర్మగారి సౌండు రికార్డింగు స్టూడియో సందర్శించారు. ఉదయం యథాప్రకారం శ్రీచక్రపూజ జరిగింది.

సాయంకాలం కొద్ది భజనలు పాడి, ఆశ్రమానికి వచ్చిన భక్తులందరితోనూ ప్రత్యేకంగా మాట్లాడి, అందర్నీ సంభ్రమ సంతోష ఆశ్చర్యాలను గావించారు. ఇక్కడ శ్రీరాజరాజేశ్వరీ దేవాలయాన్ని నిర్మించాలన్న తమ సంకల్పాన్ని వెల్లడించి, ఒక భక్తుడు దీనికై సిద్ధమవుతున్నాడని ప్రకటించారు. వెంటనే లిఫ్కో పబ్లిషర్స్ మేనేజింగు ట్రస్టీ శ్రీవిజయసారథి ముందుకు వచ్చి, తమ అనుభవాన్ని ఈ విధంగా వివరించారు – "సుమారు 3 సం॥ల క్రితం శ్రీస్వామీజీవారు నాకు రాజరాజేశ్వరీ లాకెట్టు ప్రసాదించారు. కీ.శే. శ్రీ గోపాలన్ అమ్మలాకెట్టు ఎందుకిచ్చారని అడుగగా, శ్రీస్వామీజీ, 'ఆ విషయము వచ్చే కొన్ని సంవత్సరములలో అర్థమవుతుందని సెలవిచ్చారు. సరిగా రెండు రోజుల క్రితం తనకు రాజరాజేశ్వరీ స్వప్న దర్శనమైంది"అని చెప్పి ఈ దేవాలయాన్ని నిర్మించటానికి అనుమతి ప్రసాదించవలసిందిగా వేడుకొన్నారు. శ్రీస్వామీజీ తమ అంగీకారం తెలిపారు. పిమ్మట దత్త, హనుమ దేవాలయ సందర్శన, దేవాలయ స్థల పరిశీలన గావించారు.

**14.3.2003 'విషు' ఉగాది :**

ఆశ్రమ ట్రస్టీలతో మీటింగు అనంతరం, ఆశ్రమ ప్రాంగణంలో చిన్న లైబ్రరీని ప్రారంభించారు. తదుపరి శ్రీఎల్.సుబ్రమణ్యంగారి కీరవాణి ఆలాపన జరుగుతుండగా శ్రీచక్రపూజ చేశారు. విజయ టెలివిజన్ నుంచి వచ్చిన గాయకులు శ్రీ రాఘవేంద్ర

కొన్ని భజన గీతికల నాలపించినారు. ఈ నూతన సంవత్సరం అందరికీ మంచి తెస్తుందనీ, నవంబరు నెలనుంచి మంచి రోజులు వస్తాయనీ అనుగ్రహించారు. పిమ్మట పాదుకాస్పర్శానుగ్రహాన్ని వేయిమందికి పైగా భక్తులు అందుకొన్నారు. నూతన సంవత్సర సందర్భంగా లక్ష్మీపూజ చేసి, ప్రసాదవితరణగా పూజకై ఉపయోగించిన రూపాయి నాణెమును స్వయంగా భక్తులందరికిని యిచ్చారు. తదుపరి లక్ష్మీ కుబేర హోమపూర్ణాహుతి గావించినారు.

సాయంకాలం భజన కార్యక్రమంలో, నూతన సంవత్సరాది భజన, తమిళంలో రచించి, సంగీత బద్ధంచేసి, పాడారు. తదుపరి శ్రీ దత్తవేంకటసాఫ్ట్‌వేర్ కంపెనీవారు శ్రీస్వామీజీవారి 108 నామములతో చేసిన ఒక ఆనిమేటెడ్‌ప్రోగ్రాం ప్రీవ్యూను చూసి, అందుచేయవలసిన అనేక మార్పులను సూచించారు. ఇందు శ్రీస్వామీజీవారి 108 నామములు వినిపిస్తుండగా, శ్రీవారి జీవితచరిత్రలోని కొన్ని ముఖ్యఘట్టములు ప్రసారమవుతాయి. ఇది ఇంకా రిలీజు కావలసి వుంది.

మరల ప్రతిపాదిత దేవి ఆలయ నిర్మాణ స్థలాన్ని దర్శించి, దేవాలయ నిర్మాణాన్ని గూర్చి అనేక సూచనలను చేశారు.

15.3.2003 ఉదయం పదిగంటలకు మైసూరు ఆశ్రమానికి బయలుదేరి వెళ్ళారు.

జయగురుదత్త

## ఈ మాసంలో మన పర్వాలు

| | | |
|---|---|---|
| 25.6.2003 | బుధ | సర్వేషామేకాదశి |
| 28.6.2003 | శని | మాసశివరాత్రి |
| 05.7.2003 | శని | కుమార షష్ఠి |
| 10.7.2003 | గురు | శయనైకాదశి, చాతుర్మాస్యారంభం. |
| 12.7.2003 | శని | శనిత్రయోదశి |
| 13.7.2003 | ఆది | వ్యాసపూజ, గురుపూర్ణిమ, ఆదిగురు దత్తావతారం (చెన్నై), పూర్ణిమాహోమం |
| 16.7.2003 | బుధ | దక్షిణాయన పుణ్యకాలం, సంకష్టహర చతుర్థి |
| 22.7.2003 | మంగళ | శుక్రమౌఢ్యారంభం |

# జ్ఞానబోధ సభా సభ్యులకు ముఖ్య సూచనలు

(ది. 24.5.03 అఖిల భారత జ్ఞానబోధసభల సమ్మేళనంలో శ్రీస్వామీజీవారు విడుదల చేసిన పత్రము)

1. ప్రతి జ్ఞానబోధసభ ట్రస్టీ సంవత్సరమునకు కనీసం ఒకసారైనా దత్తపీఠమును గానీ, శ్రీస్వామీజీవారిని గానీ, తప్పక సందర్శించవలెను.

2. ప్రతి జ్ఞానబోధసభ ట్రస్టీ సంవత్సరమునకు ట్రస్ట్ మూలనిధికై కనీసం రూ. 5,000 విరాళమీయవలెను. అశక్తులైనవారు విరాళములను సేకరించవలెను.

3. ట్రస్ట్ సభ్యులందరూ స్థానిక ఆశ్రమశాఖను విధిగా దర్శిస్తూ, ట్రస్ట్ సమావేశములకు హాజరు కావలెను. మూడు సమావేశములకు వరుసగా హాజరు కానివారు, సభ్యత్వమును కోల్పోయెదరు.

4. ప్రతి ట్రస్ట్ కూడా, సంవత్సరమునకు ఒక సమావేశమును శ్రీస్వామీజీవారి సమక్షములో దత్తపీఠములో గానీ, లేదా శ్రీస్వామీజీ వారికీ, ఇతర సభ్యులకు సౌకర్యముగానున్న వేరేదైనా స్థలములో గానీ నిర్వహించవలెను.

5. అవధూత దత్తపీఠమ్‌ట్రస్ట్ తో గానీ, లేదా వేరేదైనా ట్రస్ట్‌తో లైసెన్స్ అండ్ లీవ్ ఒప్పందము కుదుర్చుకున్న ట్రస్ట్‌లన్నీ, ఒప్పందం రుసుమును ప్రతి సంవత్సరము మే నెలలో దత్తజ్ఞానబోధసభ ఆఫీస్‌లోనే (మైసూరు) జమచేసి, రిజిస్టర్‌లో నమోదు చేసి, ఎక్నాలెడ్జ్‌మెంట్ (ప్రత్యేక రశీదు) పొందవలెను.

6. హుండీ వసూళ్ళలో సగ భాగము విధిగా దత్తపీఠమునకు ప్రతి జ్ఞానబోధసభ అందజేయవలెను. ఈ మొత్తమును కూడ, డి.డి.లేక నగదును ప్రతిసంవత్సరము మే నెలలోనే (శ్రీస్వామీజీవారి జన్మ దినోత్సవములలో) మరియు డిసెంబరు నెలలోనూ (దత్తాత్రేయ జయన్తి సందర్భములోనూ) దత్తజ్ఞానబోధసభ ఆఫీస్‌లోనే (మైసూరు) జమచేసి, రిజిస్టర్‌లో నమోదు చేసి, ఎక్నాలెడ్జ్‌మెంట్ (ప్రత్యేక రశీదు) పొందవలెను.

7. దత్తపీఠమునకు చెందిన పొలములను, మరియు ఇతర ఆస్తులను చూసే ట్రస్టీలు గానీ, ఇతర అధికృత వ్యక్తులు గానీ, సంబంధిత వార్షిక (అద్దె, లైసెన్స్ ఫీ, కౌలు) రుసుమును దత్తజ్ఞానబోధసభ ఆఫీస్‌లోనే (మైసూరు) జమచేసి, రిజిస్టర్‌లో నమోదు చేసి, ఎక్నాలెడ్జ్‌మెంట్ (ప్రత్యేక రశీదు) పొందవలెను.

8. ట్రస్ట్‌లో కొత్త సభ్యుల చేరిక (శ్రీస్వామీజీవారిచే నియామకం) లేక (అనారోగ్యం, మరణం, రాజీనామా, లేక అనాసక్తత, తొలగింపుల ద్వారా) తీసివేతలను విధిగా వ్రాతపూర్వకముగా దత్తజ్ఞానబోధసభా ట్రస్ట్ (మైసూరు) కు తెలియజేయవలెను.

9. తాము ప్రారంభించిన కొన్ని ట్రస్ట్‌లలో ఇంతవరకు ట్రస్టీగా కొనసాగుతున్న

శ్రీస్వామీజీ ఇకపై ట్రస్టీగా ఉండబోరు. ఆ స్థానములో శ్రీహర్షశర్మ (బాలస్వామి) గారిని ప్రెసిడెంట్‌గా నియమించారు. ఈ విధివిధానమును పూర్తి చేయుటకై, ఆయా ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీలు ట్రస్ట్ డీడ్, తీర్మానముల పుస్తకముతో సహా వచ్చి, దత్తజయంతి (2003) లోగా దత్తపీఠమును సంప్రదించవలసినది.

10) గత సంవత్సరం జ్ఞానబోధసభ సమావేశములలో అనుగ్రహించిన వాగ్దానమును, శ్రీస్వామీజీ శ్రీదత్తక్షేత్రయాత్ర ద్వారా దాదాపుగా సంపూర్తి చేశారు. మరియు ఆయా ట్రస్ట్ మూలనిధికై లక్షరూపాయలకు పైగా విరాళమును సేకరించి, ఫిక్సెడ్ డిపాజిట్ చేయించారు.

11) ప్రభుత్వం ఆర్థిక విధానము ప్రకారముగా, వడ్డీలు తక్కువగా ఉన్న నేపథ్యములో, ట్రస్టులన్నీ భారత ప్రభుత్వ, రిజర్వ్‌బ్యాంక్ 8% వడ్డీ బాండ్‌లలో మదుపు చేయుట మంచిది. 6 సంవత్సరముల ఈ బాండ్‌లలో మదుపుచేసి, 15H దరఖాస్తు దాఖలు చేయుట ద్వారా, ట్రస్ట్ ఆదాయమును పెంచుకోవచ్చు.

12. శ్రీస్వామీజీ పూజా కార్యక్రమములే గాక కొంగ్రొత్త కార్యక్రమములు నిర్వహించవలసినదని ఆదేశించారు.

13. **శ్రీస్వామీజీ సూచించిన కొన్ని కార్యక్రమములు**

అ. పేదలకు ఉచిత వస్త్రములు, ఆహారము పంపిణీ

ఆ. ఉచిత వైద్య శిబిరములద్వారా మందుల పంపిణీ

ఇ. యోగాసన శిక్షణ శిబిరము (స్వామి సహజ దత్తపాదరేణుగారు శ్రీస్వామీజీ అనుమతితో ఈ శిబిరమును నిర్వహించగలరు.)

ఈ. క్రియాయోగ ప్రారంభిక తరగతులు (శ్రీరాజారావు, శ్రీ గోపాలకృష్ణ గార్లు ఈ శిబిరములు నిర్వహిస్తున్నారు.)

ఉ) పేదలకు వైద్య సదుపాయమును ఏర్పాటు చేయుట (జి.ఎస్.ఎల్.ఎకాడెమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్, రాజమండ్రివారు తక్కువ ధరకు ఆధునిక చికిత్స ఏర్పాటు చేయుటకు అంగీకరించారు. మరియు శ్రీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్ట్, తిరుపతి, ఇతర సంస్థలు ఇట్టి సేవ చేస్తున్నాయి. రోగులకూ, సంస్థలకూ అనుసంధానం చేయవచ్చును.

ఊ) శ్రీస్వామీజీవారి సాహిత్యము, భజనలు, రామాయణ, భారతము, భాగవతములను, ఇతర ఆధ్యాత్మిక గ్రంథములను గూర్చిన ధార్మిక ఉపన్యాసములనూ, ప్రవచనములనూ నిర్వహించుట.

ఋ) సంస్కృత భాషా శిబిరములు, శ్రీస్వామీజీవారి భజనల అర్థములను తెలియపరచు కార్యక్రమముల నిర్వహణ.

ఋ) సంగీతం (భజనల) పోటీలు పట్టణ, తాలూకా, జిల్లా స్థాయిలో నిర్వహించుట.

ఎ) విపత్కర పరిస్థితులలో ఇతర సంస్థలతో కలిసిగానీ, స్వంతంగా గానీ, సహాయ కార్యక్రమములను నిర్వహించుట

ఏ) చేసే కార్యక్రమములను పత్రికా, ప్రచార సాధనములద్వారా ప్రజలకు తెలియబరచుట, మరియూ ఆ ప్రెస్ క్లిప్పింగ్స్ భక్తిమాలకు పంపుట.

14) దత్తపీఠములో జరిగే అన్ని కార్యక్రమములకూ, అన్నదానమునకూ యథాశక్తిగా తోడ్పడుట అత్యంత ముఖ్యమైన పని. మైసూరు ఆశ్రమము మనందరికీ స్వస్థలము వంటిది. అందువల్ల ఆశ్రమ నిత్య పోషణ పథకము, ఇంటింటా దత్త భిక్ష వంటి పథకములద్వారా ఎక్కువమందితో సేవ చేయించవచ్చును.

15) చిట్ట చివరిదైనా, అత్యంత ముఖ్యమైన సూచన - ఆశ్రమ కార్యక్రమములలోనూ, సత్సంగములలో, భజనలో, ట్రస్ట్ సమావేశములలో ఆధ్యాత్మిక భావమునకు, ప్రశాంతతకూ ప్రాధాన్యమీయవలెను. విరాళముల సేకరణే ప్రధానాంశము కాకూడదు.

జయగురుదత్త

శ్రీమతి కొల్లి రమణమ్మ (కీ.శే. శ్రీ కొల్లి జీవరత్నం) గార్ల ఏకైక పుత్రుడు

**చి॥ గుణాకరరావు**

శ్రీమతి & శ్రీ ఎన్ని ఘణశ్యామ్ గార్ల ఏకైక పుత్రిక

**చి॥ల॥సౌ॥ ఉమామహేశ్వరి ల**

వివాహం ది. 21.5.2003 బుధవారం రాత్రి పెద్దపద్మాపురంలో జరిగింది.

**వీరిపై శ్రీగురుదేవుల కృప వర్షించు గాక!**

శ్రీమతి & శ్రీ ఉయ్యూరు వీరనాగేశ్వరరావు గార్ల జ్యేష్ఠ కుమారుడు

**చి॥ శ్రీనివాసరావు**

శ్రీమతి & శ్రీ యాడే వీర ఈశ్వరరావు గార్ల కనిష్ఠ పుత్రిక

**చి॥ల॥సౌ॥ నాగజ్యోతి ల**

వివాహం ది. 4.6.2003 బుధవారం రాత్రి ద్వారకాతిరుమలలో జరిగింది.

**వీరిపై శ్రీగురుదేవుల కృప వర్షించు గాక!**



# చరిత్ర

## 12 వ అధ్యాయం ... ఆత్మజయం

(గత సంచిక తరువాయి)

గురుం శరీర త్రయ భారదూర
మప్యా శ్రితాచార విశేషదండమ్।
లోకాను కంపామతి మజ్ఞమూర్ఖ
ఛ్ఛందాను రోధార్థ సువేష మీడే॥

(ఆయనకు స్థూల సూక్ష్మ కారణ శరీరాలలో ఏ శరీరపు భారమూ లేదు. అయినా ఆయన సన్యాసాశ్రమ విశేషాచారమైన దండాన్ని స్వీకరించారు. అజ్ఞులైన మూర్ఖులను కొంత అనుసరించి వారిని తరింప జెయ్యాలనే దయతో మంచి (యతి) వేషం ధరించారాయన. అట్టి శ్రీగురుదేవుని స్తుతిస్తున్నాను.)

**కృతజ్ఞత :**

అలా ప్రొద్దుటూరు చేరిన స్వామివారు, తెల్లబట్టలు ధరించి, సుబామణిగారి యింటికి వెళ్ళారు. ఆ కుటుంబం వారందర్నీ తగు రీతిలో ఓదార్చి అనేక మహిమలు చూపారు.

ఆ తరువాత నరసింహశాస్త్రిగార్ని చూసి, నంజుండయ్యగార్ని ఇంట్లో దింపి, అక్కడున్న భక్తుణ్ణి ఎక్కించుకొని మైసూరు చేరారు స్వామి. కారు దిగుతూనే "నమస్కారాల త్రిప్పు అయిపోయింది. ఇంక మళ్ళీ మన శోణ వస్త్రాలు మనవే" అన్నారు స్వామివారు.

ఆ తరువాత రమణికి కావలసిన ఏర్పాట్లు చూసి, అప్పటికే చాలా రోజులుగా తన కోసం ఎదురు చూస్తున్న భక్తుల పని చూడటంలో మునిగిపోయారు స్వామివారు.

రమణిగారు ఒక వారం రోజులున్నాడు. వారం రోజులు ఇక్కడ జరుగుతున్న వింత వింత మహత్తులు చూసి, ముఖ్యంగా ఆదివార హోమాలలో వైభవం చూసి ఆశ్చర్యచకితుడు, ఆనంద సమ్మోహితుడు అయి ప్రొద్దుటూరు చేరాడు.

రమణిగారు వెళ్ళిపోయాక "ఈ ప్రొద్దుటూరు పర్యటనతో పూర్వాశ్రమ బాధ్యతలలో మరొకటి తీరింది. ఇంకొకటి మిగిలి వుంది. దానికి ఇంకొంత వ్యవధానం వుందిలే' అనుకున్నారు స్వామివారు.

**గడప మెట్టు**

ఇది జరిగిన కొద్దికాలానికే సుబ్రహ్మణ్య ముదలియార్ వచ్చి ఒక విన్నపం చేశాడు.

"స్వామీ! ఇంత మైసూరులో మరీ మూల ఎక్కడో ఊరి చివర కెసరేలో కార్యక్రమాలు చేస్తున్నారు. మాబోటి వాళ్ళం ఊరికి మరో చివర విద్యారణ్యపురం ప్రాంతంలో ఉంటున్నాం. ఎంత కోరిక వున్నా, ఇంత దూరం రావటం సామాన్యులకు సాధ్యం కావటం లేదు. కనుక మీరు వారానికొక రోజయినా మా ప్రాంతంలో కార్యక్రమం నడపమని ప్రార్థిస్తున్నాం మేమంతా."

ఆ ప్రార్థన వల్ల ప్రతి శనివారం సాయంత్రం విద్యారణ్యపురంలోని ముదలియార్ గారి ఇంటి ఆవరణలో అనుగ్రహభాషణ కార్యక్రమం ప్రారంభించారు స్వామివారు. ఇలా స్థిరంగా శనివార కార్యక్రమాలు సాగటంతో కొద్దికాలంలోనే అక్కడ గూడా జనాల రద్దీ పెరిగిపోయింది. ఫలితంగా స్వామివారు శనివారమంతా అక్కడే ఉండిపోవలసి వచ్చింది. ముదలియార్‌గారు ఒక చిన్న గది ఏర్పాటు చేయగా తన హార్మనీపెట్టి, చిడతలు తన స్నేహితులుగా, పరివారంగా, ఆ గదిలో శనివారాలు గడపసాగారు స్వామివారు.

**దండ ధారణం**

ఆ రోజుల్లో స్వామివారి దగ్గరకు రాత్రి పొద్దు పోయినాక కొందరు ప్రత్యేకంగా వచ్చేవారు. సామాన్యంగా వారంతా బాగా పండిపోయిన ముసలివాళ్ళుగా ఉండేవారు. వారు ఎటువైపు నుంచి వచ్చేవారో, ఏమో, ఎవరికీ అంతుబట్టేది కాదు. ద్వారకా మొదలైన కుర్రవాళ్ళకు వాళ్ళ రాక ఆకాశంలోంచి ఊడిపడ్డట్టుగా ఉండేది.

డొక్క లెండుకుపోయి, కనుబొమ్మలు జారిపోయి, గడ్డాలు తెగ పెరిగిపోయి ఉన్న ఆ ముసలయ్యల వొంటిమీద ఒకోసారి గోచీ గూడా ఉండేది కాదు. విడిగా వాళ్ళను గురించి ఎన్ని హాస్యాలాడుకున్నా వాళ్ళు వచ్చినప్పుడు మాత్రం వాళ్ళ వంక తేరిపార చూసేందుకు గూడా పిల్లలకి ధైర్యం వుండేది కాదు. అలాంటి వాళ్ళు వస్తూనే, సరాసరి స్వామివారి దగ్గరకు వెళ్ళిపోయి, కాళ్ళు పట్టుకొని నమస్కారం పెట్టటం, మౌనంగా కూర్చోవటం ఇంతేపని. పెదవి కదిపే పని లేదు. స్వామివారు గూడా అలాగే కూర్చుండి పోతారు. దేవతార్చనలో అర్చా గణపతి విగ్రహంలాంటో వేస్తూ అంతే. చివరికి వీళ్ళెటు పోతారో చూద్దామని ఎన్ని సార్లు కాపలా కాచుకొని కూర్చున్నా ఏ పొంటిగంట దాటాకో కునుకు పట్టేసేది. మళ్ళీ మెలకువ వచ్చేసరికి ఈ ముసలాళ్ళు వుండేవారు కాదు.

కొంతమంది కొద్దిగా మాట్లాడేవారు కాని, వాళ్ళేభాష మాట్లాడుతున్నారో, స్వామి వారు ఏ భాషలో సమాధానం చెప్తున్నారో, ఏమీ తెలిసేది కాదు. వాళ్ళని మీరేం ఆహారం తీసుకుంటారని స్వామివారు అడగటం, వారేదో చెప్పటం అది స్వీకరించి వాళ్ళ కివ్వటం ఒకటి రెండు సార్లు కనిపించింది. ఒకరో ఇద్దరో స్వామివారి భిక్షా ప్రసాదమే భోజనం చేశారు గూడా. (సశేషం)




## కందుల రమేష్, నూజివీడు

నేను 26.3.03 బుధవారము వ్యాపారనిమిత్తము, ధాన్యము నూజివీడు తీసుకొని రావడానికి అంగలూరు వెళ్ళితిని. గురువారం 27.3.03 న A.B.P. 27 నంబరుగల లారీనందు 234 బస్తాల ధాన్యము లోడు వేసుకొని, లారీ అంగలూరు నుండి బయలుదేరే ముందు, అక్కడ ఉన్న అంజనేయస్వామి గుడినందు శ్రీమాతా జయలక్ష్మీఫోటో చూచి, లారీ దిగి, నేను వెంటనే గుడిలోనికి వెళ్ళితిని. అక్కడ ఉన్న అప్పాజీ (స్వామీజీ) ఫోటో మరియు జయలక్ష్మీమాత ఫోటో చూచి చాల ఆనందించితిని. తదుపరి మాతాజయలక్ష్మీకి, అప్పాజీకీ ఈ ధాన్యమును, నన్ను, క్షేమముగా నూజివీడు చేర్చమని వేడుకొని, పగలు 12.30 నిమిషములకు లారీతో బయలుదేరాను.

సుమారు 1.15 నిమిషములకు పుట్టగుంట దాటిన తరువాత, ఎదురుగా ఉన్న చెక్‌పోస్ట్‌బోర్డును తప్పించుటకు రోడ్డు సైడు దిగేసరికి, హఠాత్‌గా రెండు టైర్లు, గోతిలోపడి, లారీ కట్టలు విరిగి రెండు టైర్లు విడిపోయి, 60 కిలో మీటర్ల వేగముతో పది అడుగులలోతు ఉన్న కాలువలో, సుమారు ఫర్లాంగు దూరము దూసుకొని వెళ్ళి ప్రక్కకు ఒరిగిపడిపోయినది. లారీ క్యాబిన్‌లో ఉన్న మేము నలుగురము, అప్పాజీ, మాతా జయలక్ష్మీని తలుచుకొని బయలుదేరటము వలన ఏ ఒక్కరికి చిన్నగాయము కూడ తగలకుండ మల్లెపూల బుట్టనుంచి బయటకు వచ్చినట్లుగా క్షేమముగా బయటకు వచ్చాం.

తదుపరి రోడ్డుమీదకు వచ్చి చూడగా, లారీ క్యాబిన్ క్రిందిభాగము మొత్తం ఊడి నీళ్ళలో కూరుకుపోయింది. లారీలో ఉన్న మొత్తం ధాన్యం, పొడి ప్రదేశంలో, ఎవరో వెలాకులు కత్తిరించి పెట్టిన విధంగా, నెట్టు లాగా పడియున్నాయి. ఏ ఒక్క బస్తా కూడ పగులుకుండ, చిరగకుండా, కుట్టుతెగకుండా పడివున్నాయి. మమ్ములను, మరియు ధాన్యమును కాపాడిన అప్పాజీకీ మరియు మాతా జయలక్ష్మీతల్లికి సదా కృతజ్ఞతలు తెలుపుకొను చున్నాను.

జయగురుదత్త

# జయహో జయహో సచ్చిదానంద

రచయిత్రి : శ్రీమతి దండి విమలమ్మ గారు, ఖమ్మం

జయహో జయహో సచ్చిదానంద
సద్గురు మద్గురు సచ్చిదానంద
అమల చరిత్ర సచ్చిదానంద
అగ్ని పునీత సచ్చిదానంద ॥జ॥
కావేరీ తీర విహార సచ్చిదానంద
కల్మష విదూర సచ్చిదానంద ॥జ॥
కాషాయాంబరధారి సచ్చిదానంద
కరుణారసభరిత సచ్చిదానంద ॥జ॥
భవభయదూర సచ్చిదానంద
అభయప్రదాయక సచ్చిదానంద ॥జ॥
జయలక్ష్మీ సుత సచ్చిదానంద
జన్మ కర్మ విమోచన సచ్చిదానంద ॥జ॥
కమల లోచన సచ్చిదానంద
విమల సేవిత సచ్చిదానంద ॥జ॥

## S.B.I. వారి విరాళము

అవధూతదత్తపీఠము (మైసూరు) హైదరాబాదు బ్రాంచి వారు, దిండిగల్ ఆశ్రమమునందు 1.4.03 నుండి 10.4.03 వరకు స్పెషాలిటీ మెడికల్ క్యాంపు నిర్వహించారు. స్టేటుబ్యాంక్ ఆఫ్ ఇండియా బాలానగర్, ఎయిర్‌ఫోర్సుఎకాడమీ, ఓల్డు ఎమ్.ఎల్.ఏక్వార్టర్సు, కమర్షియల్‌బ్రాంచి హైదరాబాదు శాఖలవారు మొత్తము నాలుగు రోజులు కేంపు స్పాన్సర్‌చేసి ఒక్కొక్క శాఖవారు మందులు తదితర ఖర్చులకు రూ॥లు 10000/- (పదివేలు) విరాళంగా సమర్పించారు. శ్రీ జి.రామకృష్ణారావు ఏ.జి.యమ్, యస్.బి.ఐ, యల్,హెచ్.ఓ వారు, ఆశ్రమక్లినిక్ మెడికల్ ఎక్విప్‌మెంటుకు రు॥లు 7200/- విరాళంగా సమర్పించారు. శ్రీస్వామీజీవారి కృప, ఆశీస్సులు వీరిపై వర్షించాలని ప్రార్థిస్తూ, భవిష్యత్తులో కూడా వీరు ఇటువంటి కార్యక్రమాలలో పాల్గొనగలరని ఆశిస్తున్నాము.

శ్రీమతి & శ్రీ కీ.శే. తమిరే జీవన్‌రావుగార్ల జ్యేష్ఠపుత్రుడు
**చి॥ తిరుమలరావు**
శ్రీమతి & శ్రీ కీ.శే. రుంకాన జనారావుగార్ల కనిష్ఠపుత్రిక
**చి॥ల॥సౌ॥ రాజేశ్వరీ ల**
వివాహం ది. 14.5.2003 బుధవారంనాడు పెద్దతామరేపల్లి గ్రామంలో జరిగింది.
**వీరిపై శ్రీగురుదేవుల కృప వర్షించు గాక!**

శ్రీమతి & శ్రీ దాసు బాలకిష్టయ్యగార్ల తృతీయ పుత్రుడు
**చి॥ పద్మనాభుడు**
శ్రీ వరకాల నర్సింహులుగారి కనిష్ఠ పుత్రిక
**చి॥ల॥సౌ॥ దేవిశ్రీ ల**
వివాహం ది. 18.5.2003 ఆదివారంనాడు మహబూబ్‌నగర్‌లో జరిగింది
**వీరిపై శ్రీ గురుదేవుల కృప వర్షించు గాక!**

శ్రీమతి & శ్రీ కాసుల శ్రీనివాస్‌రెడ్డిగార్ల ప్రథమ పుత్రుడు
**చి॥ విశ్వశాంత్ రెడ్డి**
శ్రీమతి & శ్రీ కంకర్ సుధాకర్‌రెడ్డిగార్ల ఏకైక పుత్రిక
**చి॥ల॥సౌ॥ పల్లవి రెడ్డి ల**
వివాహం ది. 25.5.2003 ఆదివారంనాడు హైదరాబాదులో జరిగింది.
**వీరిపై శ్రీ గురుదేవుల కృప వర్షించు గాక!**

శ్రీమతి & శ్రీ కారుకొండ వెంకట నర్సిములుగార్ల ఏకైక పుత్రుడు
**చి॥ వెంకట కృష్ణ ప్రసాద్**
శ్రీ జి. జైపాల్ యాదవ్ గారి ద్వితీయ పుత్రిక
**చి॥ల॥సౌ॥ జ్యోతి ల**
వివాహం ది. 25.5.2003 ఆదివారంనాడు హైదరాబాదులో జరిగింది.
**వీరిపై శ్రీ గురుదేవుల కృప వర్షించు గాక!**

శ్రీమతి & శ్రీ పల్లపల్లి రామతిమ్మారెడ్డిగార్ల జ్యేష్ఠపుత్రుడు
**చి॥ రవీంద్రారెడ్డి**
శ్రీమతి & శ్రీ పొలిమేర శివారెడ్డి గార్ల ఏకైక పుత్రిక
**చి॥ల॥సౌ॥ సృజన ల**
వివాహం ది. 18.5.2003 ఆదివారంనాడు అనంతపురంలో జరిగింది.
**వీరిపై శ్రీ గురుదేవుల కృప వర్షించు గాక!**

శ్రీమతి & శ్రీ మన్నె రామకృష్ణ గార్లచే నూతనంగా నిర్మించబడిన గృహమునందు

**గృహప్రవేశము**

ది. 26.5.2003 సోమవారంనాడు నిజామాబాదులో జరిగింది.

**వీరిపై శ్రీ గురుదేవుల కృప వర్షించు గాక!**

---

**శ్రీమతి & శ్రీ పినకా వెంకటేశ్వర రావు గార్లచే**

నూతనంగా నిర్మించబడిన గృహమునందు

**గృహప్రవేశము**

ది. 4.6.2003 బుధవారం రాత్రి కాకినాడలో జరిగింది.

**వీరిపై శ్రీ గురుదేవుల కృప వర్షించు గాక!**

---

శ్రీమతి & శ్రీ గార్లపాటి రామకృష్ణారావుగార్ల ఏకైక పుత్రిక

**చి॥ల॥సౌ॥ వెంకట పద్మావతి**

శ్రీమతి & శ్రీ జూలకంటి నాగేశ్వరరావుగార్ల కనిష్ఠ పుత్రుడు

**చి॥ శ్రీనివాసు ల**

వివాహం ది. 21.5.2003 బుధవారం రాత్రి హైదరాబాదులో జరిగింది.

**వీరిపై శ్రీ గురుదేవుల కృప వర్షించు గాక!**

---

శ్రీమతి & శ్రీ బి.వి. శివారెడ్డిగార్ల జ్యేష్ఠపుత్రుడు

**చి॥ బి. వెంకటేష్ కుమార్‌రెడ్డి**

శ్రీమతి & శ్రీ కె. శివనాథరెడ్డి గార్ల పుత్రిక

**చి॥ల॥సౌ॥ అనిత ల**

వివాహం ది. 5.5.03 సోమవారం నాడు నంద్యాలలో జరిగింది.

**వీరిపై శ్రీ గురుదేవుల కృప వర్షించు గాక!**

---

నిజామాబాదు వాస్తవ్యులు శ్రీ బి. లక్ష్మన్ శాస్త్రి గారి భార్య

శ్రీమతి బి. సుభద్ర బాయి గారు

ది. 7.1.03 నాడు స్వర్గస్థులైనారు.

శ్రీస్వామీజీవారు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించు గాక!

శ్రీమతి & శ్రీ కొప్పాక ఆదినారాయణగార్ల ఏకైక పుత్రిక
**చి॥ల॥సౌ॥ నాగ నీలిమ**
శ్రీ యీదర సత్యనారాయణగారి కనిష్ఠ పుత్రుడు
**చి॥ శ్రీనివాసు** ల
వివాహం ది. 19.2.03 బుధవారంనాడు ఆలమూరులో జరిగింది.
**వీరిపై శ్రీ గురుదేవుల కృప వర్షించు గాక!**

శ్రీమతి & శ్రీ తిరుమలశెట్టి భద్రంగార్ల ప్రథమ పుత్రుడు
**చి॥ వీరరాఘవులు**
శ్రీమతి & శ్రీ వస్సు రామకృష్ణ గార్ల ద్వితీయ పుత్రిక
**చి॥ల॥సౌ॥ దుర్గా కుమారి** ల
వివాహం ది. 16.4.2003 బుధవారం రాత్రి కాకినాడలో జరిగింది.
**వీరిపై శ్రీ గురుదేవుల కృప వర్షించు గాక!**

శ్రీమతి & శ్రీ గుముడవెల్లి రామయ్యశర్మగార్ల కనిష్ఠపుత్రుడు
**చి॥ నాగేశ్వర శర్మ (నగేశ్)**
శ్రీ యాతవాకిళ్ళ నర్సింమూర్తి గారి పాలికా పుత్రిక
**చి॥ల॥సౌ॥ పల్లవి** ల
వివాహం ది. 23.5.2003 శుక్రవారం రాత్రి యాదగిరిగుట్టలో జరిగింది.
**వీరిపై శ్రీ గురుదేవుల కృప వర్షించు గాక!**

శ్రీమతి & శ్రీ కాట్రగడ్డ వెంకటేశ్వరరావు (నాదప్రసార) గార్ల ద్వితీయ పుత్రిక
**చి॥ల॥సౌ॥ మాధురి**
శ్రీమతి & శ్రీ నిమ్మగడ్డ నాగేశ్వరరావుగార్ల పుత్రుడు
**చి॥ చౌదరి** ల
వివాహం ది: 3.5.03 శనివారం రాత్రి జయలక్ష్మీపురం ఆశ్రమంలో జరిగింది.
**వీరిపై శ్రీ గురుదేవుల కృప వర్షించు గాక!**

**శ్రీస్వామిజీవారికి జన్మదిన శుభాకాంక్షలు**
వి. ప్రదీప్ కుమార్
వివేకానందనగర్, కూకట్‌పల్లి, హైదరాబాదు

శ్రీమతి & శ్రీ గుర్రం అప్పారావుగార్ల తృతీయపుత్రిక
**చి॥ల॥సౌ॥ భానురేఖ**
శ్రీ మద్ది వెంకట రామమోహనరావుగార్ల ఏకైక పుత్రుడు
**చి॥ నాగప్రవీణ్ కుమార్** ల
వివాహం ది. 23.5.2003 శుక్రవారం రాత్రి నూజివీడులో జరిగింది.
**వీరిపై శ్రీగురుదేవుల కృప వర్షించు గాక!**

శ్రీమతి & శ్రీ మాటూరి భాస్కరరావుగార్ల ప్రథమపుత్రిక
**చి॥ల॥సౌ॥ వెంకట లలితా శివజ్యోతి**
శ్రీ అయితా సత్యనారాయణగారి దత్త పుత్రుడు
**చి॥ కేశవరావు** ల
వివాహం ది. 14.5.2003 బుధవారం రాత్రి కొత్తపాల్వంచలో జరిగింది.
**వీరిపై శ్రీగురుదేవుల కృప వర్షించు గాక!**

శ్రీమతి & శ్రీ రావిపాటి ప్రహ్లాదుడుగార్ల ద్వితీయ కుమారుడు
**చి॥ శ్రీరామ మహంకాళి**
శ్రీ మల్లె మొగ్గల సత్యనారాయణగారి ఏకైక పుత్రిక
**చి॥ల॥సౌ॥ నాగదేవి** ల
వివాహం ది. 21.5.2003 బుధవారం రాత్రి తణుకులో జరిగింది.
**వీరిపై శ్రీగురుదేవుల కృప వర్షించు గాక!**

శ్రీమతి & శ్రీ గాదిరాజు రామరాజుగార్ల జ్యేష్ఠ కుమార్తె
**చి॥ల॥సౌ॥ హైమావతి**
శ్రీ దాట్ల నారాయణరాజు అల్లుడుగారి జ్యేష్ఠపుత్రుడు
**చి॥ వీర వెంకట సత్య సూర్య సుబ్రహ్మణ్య దశరథ రామచంద్రవర్మ** ల
వివాహం ది. 4.5.2003 ఆదివారం రాత్రి కోరుకొల్లులో జరిగింది.
**వీరిపై శ్రీగురుదేవుల కృప వర్షించు గాక!**

శ్రీమతి & శ్రీ వద్దె రవీందర్‌గార్ల ఏకైక పుత్రిక
**చి॥ల॥సౌ॥ స్వాతి**
శ్రీమతి & శ్రీ ఇ.బి.రాములుగార్ల జ్యేష్ఠ పుత్రుడు
**చి॥ సునీల్ కుమార్** ల
వివాహం ది. 4.5.2003 ఆదివారం రాత్రి హన్మకొండలో జరిగింది.
**వీరిపై శ్రీగురుదేవుల కృప వర్షించు గాక!**

శ్రీస్వామీజీవారికి వందనములు మరియు జన్మదిన శుభాకాంక్షలు

# పెళ్ళి పట్టు చీరలు - స్వర్ణాభరణాల ప్రత్యేక నిలయం

## దిల్‌సుఖ్‌నగర్

## చందన బ్రదర్స్

పెళ్ళి పట్టు చీరలు - ఫ్యాన్సీ చీరలు - సూటింగ్స్ - షర్టింగ్స్
చుడీదార్స్ - డ్రస్ మెటీరియల్స్ - జెంట్స్ & కిడ్స్ రెడీమేడ్స్

పెళ్ళి శుభకార్యాలకు కావలసిన బంగారు ఆభరణాలు.

91.6 కెడియం బంగారు ఆభరణాలు

- క్వాలిటీ గ్యారంటీ కార్డ్
- కంప్యూటరైజ్డ్ నిక్కచ్చి తూకం
- ఎల్లప్పుడూ వెయిట్ టు
- వెయిట్ ఎక్స్‌చేంజ్



దిల్‌సుఖ్‌నగర్
చందన బ్రదర్స్
హైదరాబాద్

నమ్మకమైన సంస్థ నుండి నాణ్యమైన వస్త్రాలు స్వచ్ఛమైన స్వర్ణాభరణాలు

# శ్రీస్వామీజీవారి విదేశీ పర్యటనా పట్టిక

U.S.A: June 19 - Aug-28 Canada : Aug-28-Sep-4

శ్రీస్వామీజీవారి కార్యక్రమాలు ఉదయపు పూటలలో గం॥ 8 నుంచి గం॥ 9.30 వరకూ సాయంత్రపు పూటలలో గం॥ 6 నుంచి 7 వరకునూ సామాన్యంగా జరుగుతూ వుంటాయి. ఈ క్రింది ప్రయాణ పట్టికలోని కార్యక్రమాలన్నీ తాత్కాలిక నిర్ణయాలే. ఎప్పటికప్పుడు కొన్ని మార్పులు జరుగవచ్చు. సరైన కార్యక్రమ సమాచారం కోసం మీ స్థానిక కార్యకర్తల్ని సంప్రదించండి. లేదా www.SriSwamiji.org అనే వెబ్‌సైట్‌ని పరిశీలించండి. దానివల్ల మీకు కొత్త నిర్ణయాలు, సూచనలు, హోటలు వివరాలు మొదలైనవన్నీ తెలుస్తాయి.

**జూన్ 19 - 22 వరకు బ్రాడెంటన్ FL లో కార్యక్రమాలు**

N. Venkataramayya (941-794-3033) harini25@aol.com

**జూన్ 19 గురు** - నదిమింటి వారి గృహానికి శ్రీస్వామీజీ ఆగమనం

Nadiminti residence 2012 81st Street North West

**జూన్ 20 శుక్ర** - విశ్రాంతి

**జూన్ 21 శని** - సా॥ 6గం॥ - బేషోర్ హైస్కూల్ ఆడిటోరియంలో దివ్యనాద చికిత్సా కచేరీ

5401 34th St. West 941-751-7004 ext 8850;Cell 941-920-2184

**జూన్ 22 ఆది** - ఉ॥ నదిమింటి గృహంలో శ్రీచక్రపూజ, మహాగణపతిహోమం, అనుగ్రహభాషణం

**జూన్ 23-26** - విశ్రాంతి

**జూన్ 27 - జులై 1 వరకు బాటన్‌రోగ్ LA దత్తాలయంలో కార్యక్రమాలు**

Datta Temple (225-751-8949) Datta Temple@aol.com

Venue:Datta Temple.6221 Equity Drive (225-751-8949)

**జూన్ 27 శుక్ర** - దత్తాలయానికి శ్రీస్వామీజీ ఆగమనం

సా॥ శ్రీచక్రపూజ, లలితా సహస్రనామ పారాయణ, అనుగ్రహభాషణం

**జూన్ 28 శని** - ఉ॥ శ్రీచక్రపూజ, అనుగ్రహభాషణం

సా॥6గం॥ యల్.యస్.యూ. యూనియన్ థియేటర్‌లో దివ్యనాద చికిత్సా కచేరీ

(225-578-5128) Tickets $10.$15 & $20

**జూన్ 29 ఆది** - ఉ॥ శ్రీచక్రపూజ, మహాగణపతిహోమం, అనుగ్రహభాషణం, దత్తాలయ 6వ వార్షికోత్సవం

సా॥ దివ్యనామసంకీర్తన, అనుగ్రహభాషణం

జూన్ 30 సోమ - ఉ॥ శ్రీచక్రపూజ,

జులై 1 మంగళ - హోస్టన్‌కి ప్రయాణం

**జులై 1 - జులై 3 వరకు హోస్టన్ TX ఆర్యసమాజ్‌లో కార్యక్రమాలు**

Surya(225-677-8140)davvuri@etigers.net/Ram(281-530-9425)ratnaram@mail.com

Venue:Arya Samaj. 14375 Schiller Road (281-752-0100)

జులై 1 మంగళ ఆర్యసమాజ్‌కి శ్రీస్వామీజీ ఆగమనం.
సా॥ శ్రీచక్రపూజ, దివ్యనామసంకీర్తన, అనుగ్రహభాషణం

జులై 2 బుధ సా॥ శ్రీచక్రపూజ, దివ్యనామసంకీర్తన, అనుగ్రహభాషణం

జులై 3 గురు సెయింట్‌లూయిస్‌కి ప్రయాణం

**జులై 3 - జులై 7 వరకు సెయింట్‌లూయిస్ MO లో కార్యక్రమాలు**

G.V.Naidu(314-576-7114)gvnaidu@worldnet.att.net/Gavinis(314-984-8605)

జులై 3 గురు -(1) గవినీ వారి గృహానికి శ్రీస్వామీజీ ఆగమనం
12842 Thornhill, Town & Country (314-984-8605)
(2) హిందూటెంపుల్ ఆఫ్ సెయింట్‌లూయిస్ సందర్శనం
Hindu Temple of St. Louis. 725 Weidman Road (314-230-3300)

జులై 4 శుక్ర - ఉ॥ గవినీవారి గృహంలో శ్రీచక్రపూజ, గణపతిహోమం
సా॥ హిందూటెంపుల్‌లో శ్రీస్వామీజీ వారిచే దివ్యనామ సంకీర్తన, సత్సంగం

జులై 5 శని - ఉ॥ శ్రీచక్రపూజ, అనుగ్రహభాషణం,
సా॥7గం. వెబ్‌స్టర్ యూనివర్సిటీ మ్యూజిక్ ఆడిటోరియంలో
దివ్యనాద చికిత్సా కచేరీ 560 Trinity Ave. (314-961-2660)

జులై 6 ఆది - ఉ॥ శ్రీచక్రపూజ, మహాగణపతి హోమం, అనుగ్రహభాషణం,
సెయింట్‌లూయిస్‌లోని హిందూటెంపుల్ వార్షికోత్సవం.
సా॥ సత్సంగం, దివ్యనామ సంకీర్తన.

జులై 7 సోమ - న్యూబర్గ్‌కి ప్రయాణం

**జులై 7-10 వరకు న్యూబర్గ్ IN లోకార్యక్రమాలు**

Naryayana (812-853-6726)/Gurram (812-490-2640) Sanman0694@aol.com

జులై 7 సోమ - జాన్సన్‌హాల్ డెకానెస్‌సైన్స్‌హాస్పిటల్, Evansvilleకి శ్రీస్వామీజీ ఆగమనం

జులై 8 మంగళ - సా॥ శ్రీచక్రపూజ, దివ్యనామసంకీర్తన

జులై 9 బుధ - ఎమ్యూజ్‌మెంట్ పార్క్ సందర్శనం

జులై 10 గురు - సాన్‌జోస్‌కి ప్రయాణం

**జులై - 10 - 16 వరకు సాన్‌జోస్ CA లో కార్యక్రమాలు**

Mehul Patel (510-651-6226) mikergold@yahoo.com

జులై 10 గురు - జైన్‌టెంపుల్‌కి శ్రీస్వామీజీ ఆగమనం

722 South Main St. Milpitas (408-262-6242)

జులై 11 శుక్ర - ఉ॥ శ్రీచక్రపూజ,

సా॥ 7గం. శ్రీస్వామీజీ మరియు సంగీతకళాకారులచే దివ్యనామ సంకీర్తన

జులై 12 శని - ఉ॥ శ్రీచక్రపూజ, అనుగ్రహభాషణం

సా॥ ఫాక్స్‌థియేటర్‌లో దివ్యనాద చికిత్సా కచేరీ-దీని ఆదాయాన్ని భారతదేశంలో పేదల అన్నదానానికి వినియోగిస్తారు.

2215 Broadway, Redwood City (650-FOX-4119) 6 pm onwards. Tickets $10, $15, $20

జులై 13 ఆది - ఉ॥ శ్రీచక్రపూజ, అనుగ్రహభాషణం, గురుపూర్ణిమా ఉత్సవం

సా॥ 5-7 లకు దక్షిణ భారత శాస్త్రీయ నృత్యప్రదర్శన (తాత్కాలిక నిర్ణయం)

జులై 14 సోమ - ఉ॥ శ్రీచక్రపూజ

జులై 15 మంగళ - ఉ॥ శ్రీచక్రపూజ

జులై 16 బుధ - లగునాహిల్స్‌కి శ్రీస్వామీజీ ప్రయాణం

**జులై 16-21 లగునా హిల్స్ CA (L.A. Area) లో కార్యక్రమాలు**

Kusum Patel (949-362-1563/887-2126 ashokkusum@yahoo.com

Venue : Patel Residence : 26542 Broken Bit Lane

జులై 16 బుధ - శ్రీపటేల్ గృహానికి శ్రీస్వామీజీ ఆగమనం

జులై 17 గురు -ఉ॥ శ్రీచక్రపూజ, సా॥ దివ్యనామ సంకీర్తన

జులై 18 శుక్ర -ఉ॥ శ్రీచక్రపూజ, సా॥ దివ్యనామ సంకీర్తన

జులై 19 శని -ఉ॥ శ్రీచక్రపూజ, సా॥7గంటలకు లాంగ్‌బీచ్ కన్వెన్షన్ సెంటర్‌లో దివ్యనాద చికిత్సా కచేరీ 300 E. Ocean Blvd. Long Beach

జులై 20 ఆది -ఉ॥ శ్రీచక్రపూజ, మహాగణపతి హోమం

జులై 21 సోమ - లెక్సింగ్‌టన్‌కి ప్రయాణం

**జులై 21-24 వరకు లెక్సింగ్‌టన్ KY అదత్ ఇజ్రాయెల్ ఆలయంలో కార్యక్రమాలు**

Ram/Lakshmi Murthy (859-296-9945) rmurty@mpirx.com

జులై 21 సోమ - అదత్ ఇజ్రాయెల్ ఆలయానికి శ్రీస్వామీజీ ఆగమనం

124 N. Ashland (859-269-2979)

జులై 22 మంగళ -విశ్రాంతి, దృశ్యసందర్శన

జులై 23 బుధ - సా॥అదత్ ఇజ్రాయెల్ ఆలయంలో శ్రీచక్రపూజ, దివ్యనామసంకీర్తన, అనుగ్రహభాషణం

జులై 24 గురు - దల్లాస్‌కి ప్రయాణం

జులై 24-30 దల్లాస్ TX గ్రేప్‌వైన్ కన్వెన్షన్ సెంటర్‌లో కార్యక్రమాలు

Murali/Laxmi Tummala (972-444-0480) mtummala@yahoo.com

భజగోవిందం పై ఉపన్యాసములు

జులై 24 గురు - గ్రేప్‌వైన్‌కన్వెన్షన్ సెంటర్‌కి శ్రీస్వామీజీ ఆగమనం

1209 South Main, Grapevine (817-410-3459)

సా॥ గురుపరంపరపూజ, స్వాగతసభ, దివ్యనామసంకీర్తన

జులై 25 శుక్ర - ఉ॥ శ్రీచక్రపూజ, మధ్యా॥ క్రియాయోగ, వేదాంత తరగతులు, సా॥ లక్ష్మీనారాయణ పూజ, అనుగ్రహ భాషణం, దివ్యనామసంకీర్తన

జులై 26 శని - ఉ॥ దత్తవేంకట పూజ, మ॥ క్రియాయోగ మరియు వేదాంత తరగతులు. సా॥ 6 గం. టెక్సాస్‌యూనివర్సిటీహాల్‌లో దివ్యనాదచికిత్సా కచేరీ

701 W. Nedderman Dr.Arlington (817-272-3101)

జులై 27 ఆది - ఉ॥ శ్రీచక్రపూజ, గణపతి హోమం, అనుగ్రహ భాషణం
మ॥ క్రియాయోగం, వేదాంత తరగతులు
సా॥ వేదపారాయణ, అనుగ్రహభాషణం, దివ్యనామ సంకీర్తన

జులై 28 సోమ - ఉ॥ భక్తుల ఇండ్ల సందర్శన
సా॥ నార్త్‌టెక్సాస్ హిందూమందిరంలో కార్యక్రమాలు

జులై 29 మంగళ - భక్తుల ఇండ్ల సందర్శన

జులై 30 బుధ - మెంఫిస్‌కి ప్రయాణం

జులై 30 - ఆగష్టు 4 వరకు మెంఫిస్ TN లో కార్యక్రమాలు

Prasad Duggirala (901-755-1274) pduggirl@midsouth.rr.com

జులై 30 బుధ - భారత సాంస్కృతిక కేంద్రం మరియు దేవాలయంలో 2005 Highway 64.Eads (901-867-0400) శ్రీ స్కంధ మహాయజ్ఞం (5 రోజుల కార్యక్రమాలు) సా॥ 4.30 గంటలకు అనుజ్ఞ, ఋత్విగ్వరణము, రక్షాసూత్రధారణ, అంకురారోపణం, సా॥ 7 గంటలనుండి 8.30 వరకు దివ్యనామసంకీర్తన, ప్రవచనము

జులై 31 గురు ఉ॥ 7.30 గంటలకు శ్రీచక్రపూజ. ఉ॥8గంటలనుండి12 గంటల వరకు కలశస్థాపన, అగ్నిప్రతిష్ఠ, సా॥ 4 గంటలనుండి 7 గంటల వరకు యజ్ఞం, 7 గంటలనుండి 8.30 వరకు దివ్యనామసంకీర్తన, ప్రవచనము.

ఆగష్టు 1 నుంచి సెప్టెంబరు 15 వరకు శ్రీస్వామీజీవారు విదేశాలలోని పలుప్రాంతాలను సందర్శించెదరు. ఆ వివరాలు పై సంచికలో ప్రచురించబడతాయి.



5



6



7



8

BHAKTI MALA MONTHLY Regd News Paper - No 29690/76 JUNE 2003
Registered with Dept. Of posts vide Regn. Nos.
KANNADA : KA/SK/MYS-97/2003-05: ENGLISH : KA/SK/MYS-95/2003-05 & TELUGU : KA/SK/MYS-96/2003-05
Licenced to post without Prepayment vide Licence Nos.
KANNADA : WPP-SK-3 : ENGLISH : WPP-SK-1 & TELUGU : WPP-SK-2



Printed and Published by Dr. A.N. Swarnaprasad for
Sri Bhakti Mala Trust, Mysore at Lakshmi Narasimha Mudrana
Sri Ganapati Sachchidananda Ashram, Mysore - 570 025 (India)